తెలంగాణ
TELANGANA MUCHATLU
ముచ్చట్లు
TELTEL/2023/88710
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | గురువారం - 22 - మే - 2025 | సంపుటి : 2 | సంచిక : 361 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in



# మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ.. ఎన్‌కౌంటర్‌లో

# అగ్రనేత నంబాల కేశవరావు మృతి

## నారాయణపూర్-బీజాపూర్-దంతెవాడ సరిహద్దులో ఘర్షణ

- 27 మావోయిస్టులు మృతి, పోలీసు సహాయకుడు కన్నుమూత
- రూ.1.5 కోట్లు రివార్డు ఉన్న నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్‌లో మృతి
- 30 ఏళ్లలో తొలిసారి ప్రధాన కార్యదర్శి స్థాయి నేత మృతి: అమిత్ షా
- ఆపరేషన్ బ్లాక్ ఫారెస్ట్ విజయం – భద్రతా బలగాలపై ప్రధాని, హోంమంత్రుల ప్రశంసలు
- 54 అరెస్టులు, 84 లొంగిపోయినవారు – నక్సలిజంపై కేంద్రం దృష్టి
- బస్తర్‌లో గతంలో ఎల్టీటీఈ శిక్షణ పొందిన కేశవరావు
- గణపతికి అనంతరం సుప్రీం కమాండర్‌గా బాధ్యతలు చేపట్టిన బసవరాజు
- పీపుల్స్ వార్ నుండి సెంట్రల్ మిలిటరీ కమిషన్ వరకు – కేశవరావు ఉద్యమ ప్రయాణం
- 2010లో 76 CRPF జవాన్లు హతమైన ఘటనకు సూత్రధారి
- చనిపోయిన మావోయిస్టుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం
- ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, మహారాష్ట్రల్లో నక్సలైట్ కదలికలపై భద్రతా దళాల పట్టు
- కేంద్ర ప్రభుత్వం లక్ష్యం – 2026 మార్చి నాటికి నక్సలిజం నిర్మూలన
- బసవరాజు మృతి – మావోయిస్టు శిబిరాల్లో ఆందోళన
- శ్రీకాకుళం జిల్లా నుండి దేశవ్యాప్తంగా మావోయిస్టు నేతగా ఎదిగిన బసవరాజు

**ప్రధాని మోదీ రిట్వీట్**

"ఈ అద్భుతమైన విజయం సాధించిన మన దళాలను చూసి గర్విస్తున్నాము. మావోయిజం ముప్పును నిర్మూలించడానికి, మన ప్రజలకు శాంతి, పురోగతితో కూడిన జీవితాన్ని అందించడానికి మా ప్రభుత్వం కట్టుబడి ఉంది." అని అమిత్ షా ట్వీట్‌ను రిట్వీట్ చేశారు ప్రధాని మోదీ.

(హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు):

ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. నారాయణపూర్‌బీజాపూర్‌దంతెవాడ జిల్లాల సరిహద్దులో ఉన్న అడవుల్లో భద్రతా దళాలతో జరిగిన భారీ ఎన్ కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేత, నంబాళ్ల కేశవరావు సహా 27 మంది మావోయిస్టులు మృతి చెందారు. ప్రధాన కార్యదర్శి స్థాయి నేత ఎన్‌కౌంటర్‌లో మరణించడం 30 ఏళ్లలో తొలిసారని కేంద్రం హోంమంత్రి అమిత్ షా ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

మాఢ్ ప్రాంతంలో పెద్దఎత్తున మావోయిస్టులు ఉన్నట్టు సమాచారం అందడంతో బీజాపూర్, నారాయణపూర్, దంతేవాడ DRG బలగాలు సెర్చ్ ఆపరేషన్ నిర్వహించాయి. ఈ క్రమంలోనే మావోయిస్టులు తారసపడి కాల్పులు జరపడం వల్ల భద్రతా దళాలు ఎదురు కాల్పులు జరిపాయి. ఈ ఎన్ కౌంటర్ లో 28 మంది మవోయిస్టులు మరణించినట్టు అధికారిక వర్గాలు తెలిపాయి. ఈ ఎదురు కాల్పుల్లో పోలీసు సహాయకుడు ఒకరు మృతి చెందినట్లు చత్తీస్‌గఢ్ హోంమంత్రి విజయ్ వర్మ తెలిపారు.

# ఢిల్లీ శ్రీనగర్ ఇండిగో విమానానికి తప్పిన పెను ప్రమాదం

(ఢిల్లీ, తెలంగాణ ముచ్చట్లు)

ఉత్తరాది రాష్ట్రాల్లో వాతావరణం ఒక్కసారిగా మారింది. ఢిల్లీ సహా పలు రాష్ట్రాల్లో తీవ్ర ఈదురు గాలులు, వడగళ్లతో కూడిన భారీ వర్షం బీభత్సం సృష్టించింది. ఈ క్రమంలో ఢిల్లీ నుంచి శ్రీనగర్‌కు వెళ్తున్న ఓ ఇండిగో విమానం గాల్లో ఉండగా తీవ్ర కుదుపులకు లోనైంది. దీంతో పైలట్ వెంటనే ఎమర్జెన్సీ ప్రకటించారు. చివరకు విమానం సురక్షితంగా దిగడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. విమానం ముందు భాగం దెబ్బతినడం, ప్రయాణికులు తీవ్ర భయాందోళనలకు గురై కేకలు వేసిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఢిల్లీ నుంచి శ్రీనగర్‌కు బయలుదేరిన ఇండిగో 6E2142 విమానానికి ప్రతికూల వాతావరణం ఎదురైంది. దీంతో విమానం తీవ్ర కుదుపులకు లోనయ్యింది. దీంతో అందులో ప్రయాణికులు తీవ్ర భయాందోళలతో అరుపులు, కేకలు వేస్తూ గట్టిగా సీట్లను పట్టుకున్న దృశ్యాలు కనిపించాయి. ఎమర్జెన్సీ ప్రకటించిన పైలట్.. శ్రీనగర్ ఏటీసీకి సమాచారం ఇచ్చారు. దీంతో విమానం సురక్షిత ల్యాండింగ్‌కు చర్యలు చేపట్టారు. చివరకు విమానం సేఫ్ ల్యాండింగ్ అయినట్లు ఎయిర్‌పోర్టు అథారిటీ అధికారులు వెల్లడించారు. అయితే, విమానం ముందుభాగం తీవ్రంగా దెబ్బతింది.





# దేశానికే దిశానిర్దేశం చేసిన మహానాయకుడు రాజీవ్ గాంధీ

- రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా సచివాలయంలో నివాళులర్పించిన సీఎం
- 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించిన రాజీవ్ – యువతకు దిక్సూచి



2 లో..

# మరో పాక్ అధికారి బహిష్కరణ..

**24గంటల్లో భారత్‌ను వీడాలని ఆదేశం**

(ఢిల్లీ, తెలంగాణ ముచ్చట్లు)

పాకిస్తాన్ హైకమిషన్‌లో పనిచేస్తున్న మరో అధికారి పనితీరుపై భారత ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేసింది. తన అధికారిక హోదాకు అనుగుణంగా నడుచుకోవట్లేదని అసంతృప్తి వ్యక్తం చేసింది. సదరు అధికారిని బహిష్కరిస్తూ, 24 గంటల్లోగా భారత్‌ను విడిచి వెళ్లాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు కేంద్ర విదేశాంగ శాఖ బుధవారం వెల్లడించింది. మే 13న దేశంలో గూఢచర్యానికి పాల్పడుతున్నారనే ఆరోపణలతో హైకమిషన్‌లో పనిచేస్తున్న ఓ పాకిస్తాన్ అధికారిని బహిష్కరించిన సంగతి తెలిసిందే. తాజాగా మరో అధికారి బహిష్కరణకు గురయ్యాడు. అయితే, దీనికి సంబంధించిన కారణాలను ప్రభుత్వం బహిర్గతం చేయలేదు. దేశంలో తన అధికారిక హోదాకు సరిపోని కార్యకలాపాలకు పాల్పడినందుకు పర్సోనా నాన్ గ్రాటాగా భారత ప్రభుత్వం ప్రకటించిందని విదేశాంగ మంత్రిత్వ శాఖ (ఎంఈఏ) వివరించింది. ఆ అధికారిని 24 గంటల్లోపు భారత్ విడిచి వెళ్లాలని కోరినట్లు పేర్కొంది. ఇదే సమయంలో, న్యూఢిల్లీలోని హైకమిషన్ అధికారులు భారత్‌లో పనిచేస్తున్న పాకిస్తాన్ దౌత్యవేత్తలు లేదా అధికారులు ఎవరైనా సరే తమ అధికారాలను, హోదాను ఏ విధంగానూ దుర్వినియోగం చేయకూడదని ఖచ్చితమైన ఆదేశాలు జారీ చేసింది.

# గ్రామ పంచాయతీలకు భారీ ఊరట.. పెండింగ్ బిల్లులు క్లియర్ చేసిన సర్కార్

(హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు)

తెలంగాణ వ్యాప్తంగా గ్రామ పంచాయతీ పెండింగ్ బిల్లులను ఎట్టకేలకు సర్కారు మంజూరు చేసింది. ప్రధానంగా రూ.10 లక్షల లోపు బిల్లులు క్లియర్ చేసింది. ఇందుకోసం బుధవారం మొత్తంగా ఒకే రోజున రూ.153 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. గ్రామాల్లో ఎన్నో అభివృద్ధి పనులు చేసి నేటికీ బిల్లులు అందక ఇబ్బందులు మాజీ సర్పంచ్‌లు ఇబ్బందులు పడుతున్నారు. వైకుంఠ ధామాలు, పల్లె ప్రకృతి వనాలు, రైతు వేదికలు, డంపింగ్ యార్డులు, సీసీ రోడ్లు, అంతర్గత మురుగు కాలువలు మొదలగు అనేక కార్యక్రమాలు విడతలుగా వారివారి సొంత డబ్బులతో చేపట్టారు. చాలా కష్టపడి గ్రామాలను అభివృద్ధి పథంలో తీసుకెళ్లిన సర్పంచుల బిల్లుల చెల్లింపుల్లో గత ప్రభుత్వం జాప్యం చేయడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలోనే పెండింగ్ బిల్లుల విషయమై ప్రభుత్వానికి పలుమార్లు వినతి పత్రాలు అందించినా కాగితాలకే పరిమితమం అయ్యాయి. గత ప్రభుత్వం హయంలో గ్రామ పంచాయతీలకు భారీ మొత్తంలో నిధులు పెండింగ్‌లో పెట్టింది. దీంతో కాంగ్రెస్‌ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న 9990 బిల్లులు ఒకే రోజున క్లియర్‌చేసింది. 2024 ఆగస్టు వరకు పెండింగ్‌లో ఉన్న బిల్లుల నిధులకు ప్రాధాన్యం ఇచ్చింది. ఇందుకు గాను ఒకే విడతలో రూ.10 లక్షల లోపు బిల్లులను సర్కారు చెల్లించింది. వీటితో పాటుగా ఎస్డీఎఫ్ (ప్రత్యేక అభివృద్ధి నిధి) కింద చేపట్టిన వివిధ పనులకు రూ.85 కోట్లను సైతం విడుదల చేసింది.

# తెలంగాణను ముంచెత్తిన వర్షాలు

## జంట నగరాల్లో భారీ వర్షం, రెయిన్ అలర్ట్ జారీ

- సికింద్రాబాద్, బంజారాహిల్స్ నుంచి గచ్చిబౌలి వరకు వర్షం దంచికొట్టింది
- ద్రోణి, ఉపరితల ఆవర్తన ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షా ల బీభత్సం
- హైదరాబాద్–సికింద్రాబాద్ మీదుగా మేఘాల కమ్ముదల, మోస్తరు నుంచి భారీ వర్షా లు
- ధాన్యం భద్రతపై సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు – లోతట్టు ప్రాంతాల్లో ప్రత్యేక జాగ్రత్తలు
- ఎస్‌డీఆర్‌ఎఫ్, ఎన్‌డీఆర్‌ఎఫ్ బలగాలు సిద్ధంగా ఉంచాలని అధికారులకు ఆదేశాలు
- 2024 సెప్టెంబర్ ఘటన పునరావృతం కాకుండా ముందస్తు ప్రణాళికలపై అధికారులకు ఆదేశాలు
- జీహెచ్‌ఎంసీ అలర్ట్: మాన్‌హోల్స్, కరెంట్ పోల్స్ దగ్గర జాగ్రత్తలు పాటించాలి
- రాత్రి తుఫాను ముప్పు – వాతావరణ శాఖ హెచ్చరిక
- జిల్లాల వారీగా ఆరెంజ్ అలర్ట్‌లు జారీ – రైతులకు అప్రమత్తత సూచన
- ట్రాఫిక్, విద్యుత్ సమస్యలు నివారించేందుకు అన్ని విభాగాల సమన్వయం అవసరం





(హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు)

నగరంలో పలుచోట్ల వర్షం దంచికొడుతోంది. సికింద్రాబాద్, బేగంపేట్, బోయిన్‌పల్లి, బంజారాహిల్స్, మోహిదీపట్నం, ఆసిఫ్‌నగర్, కార్వాన్, మలక్‌పేట్, సైదాబాద్, చాదర్ ఘాట్, మారేడుపల్లి, షేక్‌పేట్, మాదాపూర్, గచ్చిబౌలి, అత్తాపూర్, అంబర్‌పేట్, అత్తాపూర్, రాజేంద్రనగర్, నల్లకుంట, నాచారం, తార్నాక, తిరుమలగిరి, అల్వాల్, బొల్లారం, ఉప్పల్, రామంతాపూర్‌లో భారీ వర్షం కురుస్తోంది.

ద్రోణి, ఉపరితల ఆవర్తన ప్రభావంతో తెలంగాణ వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. రాజధాని నగరం హైదరాబాద్‌తో పాటు పలు జిల్లాల్లో బుధవారం మధ్యాహ్నం నుంచి ఈదురు గాలులు, పిడుగులతో కూడిన వానలు పడుతున్నాయి. ఈ క్రమంలో తెలంగాణ ప్రభుత్వం 'రెయిన్ అలర్ట్' జారీ చేసింది.ఉపరితల ద్రోణి ఉదయం నుంచి హైదరాబాద్‌సికింద్రాబాద్ జంట నగరాలపై మేఘాలు కమ్ముకోగా.. మధ్యాహ్నం నుంచి పలుచోట్ల ఈదురు గాలులతో వర్షంకురుస్తోంది. కొన్ని చోట్ల చిరుజల్లులు, మరికొన్ని చోట్ల ఓ మోస్తరు వాన పడుతోంది. మలక్ పేట్, నాంపల్లి, చార్మినార్, దిల్‌సుఖ్ నగర్, కోఠి, రామంతపూర్, అబిడ్స్, అంబర్‌పేట్.. తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురుస్తోంది. ఖైరతాబాద్, లక్డీకాపూల్, రాజ్ భవన్, ట్యాంక్ బండ్ సమీపంలో స్వల్ప వర్షంతో మొదలై.. జడి వానగా మారింది. నగర శివారు ప్రాంతాల్లో చోట్ల చిరు జల్లులు పడుతున్నాయి.

మిగతా 2లో..

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ.. ఎన్‌కౌంటర్‌లో
# అగ్రనేత నంబాల కేశవరావు మృతి

(మొదటి పేజీ తరువాయి)





ఈ ఘటనలో గాయపడిన జవానుకు ప్రాణాపాయం లేదని వెల్లడించారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఉదయం నుంచి భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య భారీగా ఎదురు కాల్పులు జరుగుతున్నట్టు సమాచారం. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేత నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు మరణించారు. బసవరాజు ఉన్నారన్న సమాచారంతో మాఢ్ ప్రాంతాన్ని బలగాలు చుట్టుముట్టినట్టు తెలుస్తోంది. నంబాల కేశవరావుపై కోటిన్నర రివార్డు ఉందని పోలీసులు తెలిపారు. గణపతి రాజీనామాతో పార్టీకి సుప్రీం కమాండర్ బాధ్యతలను నంబాల కేశవరావు నిర్వహించారు. నంబాల కేశవరావు స్వస్థలం శ్రీకాకుళం జిల్లా జియ్యన్నపేట. తూర్పు గోదావరి, విశాఖలో మావోయిస్టు పార్టీలో పనిచేశారు. పీపుల్స్‌వార్ వ్యవస్థాపకుల్లో నంబాల కేశవరావు ఒకరు. మావోయిస్టు సెంట్రల్ మిలిటరీ కమిషన్ అధిపతిగా నంబాల కేశవరావు పనిచేశారు. వరంగల్ ఆర్‌ఈసీలో నంబాల కేశవరావు ఇంజినీరింగ్ చదివారు. ఆయన తండ్రి ఉపాధ్యాయుడు. 1984లో ఎంటెక్ చదువుతూ పీపుల్స్ వార్ సిద్ధాంతల పట్ల నంబాల కేశవరావు ఆకర్షితులయ్యారు. గెరిల్లా యుద్ధం, ఐఈడీ పేలుడు పదార్థాల వినియోగంలో మావోయిస్టు పార్టీకి మూల స్తంభంగా ఉన్నారు. 1987లో బస్తర్ అడవుల్లో మాజీ ఎల్టీటీఈ, మాజీ సైనికుల వద్ద శిక్షణ తీసుకున్నారు. 2018 నవంబర్‌లో గణపతి రాజీనామా తర్వాత మావోయిస్టు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా నంబాల బాధ్యతలు చేపట్టారు. 2010లో ఛత్తీస్‌గఢ్‌లో 76 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్ల మృతి ఘటనకు నంబాల కేశవరాలు సూత్రధారిగా ఉన్నారు.

**ఇంత పెద్ద నేత చనిపోవడం..**
**ఇదే మొదటిసారి! : అమిత్ షా**

పోలీసుల ఎన్‌కౌంటర్‌లో సీపీఐమావోయిస్టు ప్రధాన కార్యదర్శి నంబాల కేశవ్ రావు చనిపోయినట్లు కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించారు. ఈ మేరక ఎక్స్‌లో పోస్ట్ చేశారు. నక్సలిజంపై భారత్ చేస్తున్న మూడు దశాబ్దాల పోరాటంలో ప్రధాన కార్యదర్శి స్థాయి నాయుకుడిని భద్రతా దళాలు అంతం చేయడం ఇదే మొదటిసారి అని అన్నారు.

"నక్సలిజాన్ని నిర్మూలించే పోరాటంలో ఇది మైలురాయి. ఈరోజు ఛత్తీస్ గఢ్‌లోని నిరాయణపుర్‌లో జరిగిన ఆపరేషన్‌లో మన భద్రత దళాలు 27మంది భయంకరమైన మావోయిస్టులను మట్టుబెట్టాయి. వీరిలో సీపీఐ మావోయిస్టు ప్రధాన కార్యదర్శి, అగ్ర నాయకుడు, నక్సల్ ఉద్యమానికి వెన్నెముకగా నిలిచిన నంబాల కేశవ్ రావు అలియాస్ బసవరాజు ఉన్నారు." అని అమిత్ షా పేర్కొన్నారు. ఆపరేషన్ బ్లాక్ ఫారెస్ట్‌లో పాల్గొన్న భద్రతా దళాల ధైర్య సాహసాలను ప్రశంసించారు. ఈ ఆపరేషన్ తర్వాత ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, మహారాష్ట్రలో 54మంది నక్సలైట్లు అరెస్టు అయ్యారని, 84మంది లొంగిపోయారని తెలిపారు. 31 మార్చి 2026లోగా నక్సలిజాన్ని నిర్మూలించాలని మోదీ ప్రభుత్వం నిశ్చయించుకుందని ఉద్ఘాటించారు.

# తెలంగాణను ముంచెత్తిన వర్షాలు

(మొదటి పేజీ తరువాయి)

మరికొన్ని గంటల్లో జంట నగరాల వ్యాప్తంగా పూర్తి స్థాయిలో భారీ వర్షం కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అలర్ట్ జారీ చేసింది. అలాగే.. రాత్రి సమయంలో హైదరాబాద్‌లో తీవ్రమైన తుఫానువచ్చే అవకాశం ఉందని హెచ్చరించింది. ఈ నేపథ్యంలో జీహెచ్ఎంసీ అప్రమత్తం అయ్యింది. సాయంత్రం పనులు ముగించుకుని వెళ్లేవాళ్లను అప్రమత్తం చేస్తోంది. మ్యాన్ హోల్స్, కరెంట్ పోల్స్ విషయంలో జాగ్రత్తగా ఉండాలని నగర ప్రజలకు సూచించింది.ఇదిలా ఉంటే.. ద్రోణి, ఉపరితల ఆవర్తన ప్రభావంతో రాజధాని నగరంతో పాటు తెలంగాణ వ్యాప్తంగా పలు జిల్లాల్లో ఇప్పటికే వర్షాలు కురుస్తున్నాయి. రెండు రోజులపాటు ఈదురు గాలులు, పిడుగులతో కూడిన భారీ వానలు తప్పవని వాతావరణ శాఖ హెచ్చరించింది. పలు జిల్లాలకు ఇప్పటికే ఆరెంజ్ అలర్ట్‌లు జారీ చేసింది. ఇక పంట చేతికొచ్చే సమయం కావడంతో అప్రమత్తంగా ఉండాలని రైతులకు అధికార యంత్రాంగం సూచిస్తోంది. వాతావరణ శాఖ భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం స్పందించింది. రాష్ట్ర వ్యాప్తంగా రెయిన్ అలర్ట్ జారీ చేసింది. సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదు అయ్యే అవకాశం ఉండడంతో.. అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. ముందస్తు ప్రణాళికలతో సమన్వయం చేసుకోవాలని సూచించింది. అలాగే.. ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్ బెటాలియన్లను సైతం అందుబాటులో ఉండాలని ఆదేశించింది.‘‘ఋతుపవనాలు ముందుగా రాబోతున్నాయి. అన్ని విభాగాలు అప్రమత్తంగా ఉండాలి. 2024లో కురిసిన భారీ వర్షాలకు NDRF అందుబాటులో లేకపోవడంతో గోల్డెన్ అవర్ కోల్పోయాం. 2024 సెప్టెంబర్ లాంటి ఘటనలు మళ్ళీ పునరావృతం కావొద్దు. జిల్లాల్లో కలెక్టర్లు ముందస్తు ప్రణాళికలు, సమన్వయం చేసుకోవాలి. సింగరేణి లో ప్రత్యేక శిక్షణ పొందిన రెస్క్యూ టీమ్స్ కూడా అందుబాటులో ఉన్నాయి’’ అని సర్క్యులర్‌లో డిజాస్టర్స్ మేనేజ్మెంట్ ప్రిన్సిపల్ సెక్రెటరీ అరవింద్ కుమార్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం సీఎస్‌తో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని, వాతావరణ శాఖ ఇచ్చిన సూచనలకు అనుగుణంగా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ‘‘ధాన్యం కొనుగోలు కేంద్రాలు, మార్కెట్లలో ఉన్న ధాన్యం తడవకుండా తగిన రక్షణ చర్యలు చేపట్టాలి. కలెక్టర్లు.. కాంటాలు వేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలి. లోతట్టు ప్రాంతాల ప్రజలు ఇబ్బంది పడకుండా తగిన చర్యలు చేపట్టాలి. హైదరాబాద్ సిటీలో వర్షం కురుస్తున్న ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిల్వ లేకుండా చూడాలి. ట్రాఫిక్ ఇబ్బందులు, విద్యుత్తు సమస్యలు లేకుండా చూడాలి. జీహెచ్ఎంసీ, పోలీస్, హైడ్రా, ట్రాఫిక్, విద్యుత్తు విభాగాలు సమన్వయంతో పని చేయాలి. ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలి’’ అని సీఎస్‌ను ఆదేశించారాయన.







# దేశానికే దిశానిర్దేశం చేసిన మహానాయకుడు రాజీవ్ గాంధీ

- రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా సచివాలయంలో నివాళులర్పించిన సీఎం
- 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించిన రాజీవ్ – యువతకు దిక్సూచి
- ఆర్థిక మరియు సరళీకరణ విధానాల ద్వారా భారత అభివృద్ధికి బలమైన పునాది
- పహల్గాం ఘటనపై కేంద్రంపై తీవ్ర విమర్శలు – “ఇందిరమ్మలా ధైర్యంగా స్పందించాలి”
- “ట్రంప్ చెప్పగానే కాల్పుల విరమణ – కేంద్రం చేతగానితనానికి నిదర్శనం”
- “కిషన్ రెడ్డి విమర్శలు తన వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునే యత్నం”
- “రాజీవ్ విగ్రహంపై విమర్శలు చేయడం సంకుచిత మనస్తత్వానికి నిదర్శనం”
- “దేశానికి ప్రాణత్యాగం చేసిన గాంధీ కుటుంబం సేవలను మరువరాదు”

(హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు)

ప్రధానిగా దేశానికే వన్నె తెచ్చిన మహా నాయకుడు రాజీవ్‌గాంధీ అని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా సచివాలయం వద్ద విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం మాట్లాడారు. ఆర్థిక, సరళీకృత విధానాలతో భారత్‌ను బలమైన దేశంగా రాజీవ్‌గాంధీ నిలబెట్టారన్నారు. 18 ఏళ్లకే ఓటు హక్కును కల్పించి ప్రభుత్వాల ఏర్పాటులో యువతకు భాగస్వామ్యం కల్పించారని చెప్పారు. ‘‘పహల్గాం ఘటన నేపథ్యంలో దివంగత ప్రధాని ఇందిరా గాంధీ స్ఫూర్తిని దేశంలో ప్రతిఒక్కరూ గుర్తు తెచ్చుకున్నారు. దేశ పౌరులపై దాడులకు తెగబడితే ఆనాడు ఇందిరమ్మ పాకిస్థాన్‌కు గుణపాఠం చెప్పారు. మా దేశాన్ని మేం రక్షించుకోగలుగుతాం.. ఎవరి మధ్యవర్తిత్వం అవసరం లేదని ఆమె ఆనాడే స్పష్టం చేశారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెబితే కాల్పుల విరమణ చేసిన పరిస్థితి ఇప్పటి కేంద్ర ప్రభుత్వానిది. రాహుల్ గాంధీని విమర్శించడం ద్వారా భాజపా నాయకులు తమ చేతగానితనాన్ని కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారు. కేంద్రానికి అండగా నిలబడాల్సిన సమయంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి బయటకు రాలేదు. మేం బయటకు వచ్చి మద్దతు తెలిపాం. ఆనాడు కనీసం మమ్మల్ని అభినందించని వ్యక్తి.. ఈరోజు రాహుల్ గాంధీని విమర్శిస్తున్నారు. తన చేతగానితనాన్ని కప్పిపుచ్చుకునేందుకే కిషన్‌రెడ్డి విమర్శలు చేస్తున్నారు. సెక్రటేరియట్ దగ్గర రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తే కొందరు విమర్శలు చేశారు. సంకుచిత మనస్తత్వం కలిగిన కొందరు ఆ వ్యాఖ్యలు చేశారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన చరిత్ర గాంధీ కుటుంబానిది, కాంగ్రెస్ పార్టీది. దేశ రక్షణ కోసం భారత జవాన్లకు అండగా నిలబడతాం.. అది మా బాధ్యత. దేశ సమగ్రత విషయంలో మేం రాజకీయాలు చేయం.. దేశ భద్రతకు కట్టుబడి పనిచేస్తాం’’ అని రేవంత్‌రెడ్డి తెలిపారు.

# పసిడి ప్రియులకు షాక్..

గతంలో ఎన్నడూ లేని విధంగా పసిడి ధరలు పరుగులు పెడుతున్న విషయం తెలిసిందే.. నెల క్రితం లక్ష మార్కు దాటేసిన బంగారం ధరలు.. ఆ తర్వాత అంతగా దూకుడు కొనసాగించలేదు. ఆ తర్వాత ధరలు క్రమంగా తగ్గుతూ వచ్చాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా పసిడి ధరలు పరుగులు పెడుతున్న విషయం తెలిసిందే.. నెల క్రితం లక్ష మార్కు దాటేసిన బంగారం ధరలు.. ఆ తర్వాత అంతగా దూకుడు కొనసాగించలేదు. ఆ తర్వాత ధరలు క్రమంగా తగ్గుతూ వచ్చాయి.. ఈ క్రమంలోనే మంగళవారం తగ్గిన బంగారం ధరలు.. బుధవారం భారీగా పెరిగాయి.. ఒక్కరోజే పసిడి ధర దాదాపుగా రూ.2400 పెరిగింది. లక్ష మార్కు దాటిన తర్వాత.. నెల వ్యవధిలో ధరలు ఇంతలా పెరగడం ఇదే మొదటిసారి.. బుధవారం బులియన్ మార్కెట్ ప్రకారం..24 క్యారెట్ల పసిడి ధర పది గ్రాములపై రూ.2400 మేర ధర పెరిగి రూ.97,420 గా ఉంది. 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ. 2,200 మేర ధ పెరిగి రూ.89,300 లుగా ఉంది. వెండి కిలో ధర రూ.100 మేర ధర తగ్గి.. రూ.96,900 లుగా ఉంది. హైదరాబాద్‌లో 24 క్యారెట్ల బంగారం ధర రూ.97,420గా ఉండగా.. 22 క్యారెట్ల ధర రూ. 89,300లుగా ఉంది. మరోవైపు కిలో వెండి ధర హైదరాబాద్‌లో రూ.1,07,900లుగా ఉంది. విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.97,420గా ఉండగా.. 22 క్యారెట్ల ధర రూ. 89,300లుగా ఉంది. మరోవైపు కిలో వెండి ధర రూ.1,07,900లుగా ఉంది. ఢిల్లీలో 10 గ్రాముల 22 క్యారెట్ల పసిడి ధర రూ.89,450, 24 క్యారెట్ల ధర రూ.97,570 గా ఉంది. ముంబైలో 22 క్యారెట్ల ధర రూ.89,300, 24 క్యారెట్ల ధర రూ.97,420 గా ఉంది. చెన్నైలో 22 క్యారెట్ల ధర రూ.89,300, 24 క్యారెట్ల రేటు రూ.97,420 గా ఉంది. బెంగళూరులో 22 క్యారెట్ల ధర రూ.89,300, 24 క్యారెట్ల ధర రూ.97,420 గా ఉంది.



# ఈ బుల్లి ఎస్‌యూవీలు భలే బాగున్నాయ్.. దాదాపు ఒకే ఫీచర్లతో రెండు కార్లు

మన దేశంలోని కార్ల మార్కెట్ లో వివిధ కంపెనీల మధ్య పోటీ నెలకొంది. ప్రజల అవసరాలు, ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా వివిధ మోడళ్ల వాహనాలు తయారవుతున్నాయి. నేటి కాలంలో మధ్యతరగతి ప్రజలు కూడా కార్లను వినియోగిస్తున్నారు. వారి ఆదాయ స్థాయికి అనుగుణంగా అందుబాటు ధరల్లో లభించడమే దీనికి కారణం. పెట్రోలు, డీజిల్, సీఎన్జీ, ఎలక్ట్రిక్.. ఇలా అనేక విభాగాల్లో కార్లు సందడి చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో మధ్యతరగతి ప్రజలు కొనుగోలు చేయగలిగే కార్లలో సిట్రోయెన్ సీ3, టాటా పంచ్ ముందుంటాయి. సీఎన్జీ విభాగంలో కూడా వీటిని అందుబాటులోకి తీసుకువచ్చారు. ఫ్రెంచ్ కంపెనీ నుంచి విడుదలైన సిట్రోయన్ సీ3 కారును మన దేశ మార్కెట్ కు అనుగుణంగా తయారు చేశారు. దీన్ని ఇటీవల సీఎన్జీ పవర్ ట్రెయిన్ ఎంపికతో ఆధునీకరించారు. అయితే సీఎన్జీ కిట్లను డీలర్ స్థాయిలో ఇన్ స్టాల్ చేస్తారు. మార్కెట్ లో ప్రస్తుతం ఉన్న మారుతీ బాలెనో, ఇతర ప్రీమియం హ్యాచ్ బ్యాక్ లకు సిట్రోయెన్ సీ3 పోటీగా మారుతుందని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా టాటా పంచ్ తో ప్రధాన పోటీ ఉంటుంది. ఎందుకంటే ఇవి రెండిరటినీ బేబీ ఎస్ యూవీలుగా భావించవచ్చు. స్టైల్, పవర్ ట్రెయిన్, ఇతర లక్షణాలలో ఒకే విధంగా కనిపిస్తాయి. సిట్రోయెన్ సీ3 కారు రూ.6.23 లక్షల(ఎక్స్ షోరూమ్)కు అందుబాటులోకి వచ్చింది. అదనంగా మరో రూ.93 వేలు చెల్లించి సీఎన్జీ కిట్ ను ఏర్పాటు చేసుకోవచ్చు. 1.2 లీటర్ నేచురల్లీ ఆస్పిరేటెడ్ ఇంజిన్ కలిగిన లైవ్, ఫీల్, ఫీల్ (ఓ), ఫైన్ వేరియంట్ల కోసం ప్రత్యేకంగా ఈ కిట్లను తయారు చేశారు. టాటా పంచ్ ఐసీఎన్జీ కారు ధర రూ.7.30 లక్షల (ఎక్స్ షోరూమ్) నుంచి ప్రారంభమవుతుంది.సిట్రోయెన్ సీ3 కారులో 1.2 లీటర్ నేచురల్లీ ఆస్పిరేటెడ్ ఇంజిన్ ఏర్పాటు చేశారు. దీనికి ఐదు స్పీడ్ గేర్ బాక్స్ జత చేశారు. ఇంజిన్ నుంచి రూ.81 బీహెచ్‌పీ, 115 ఎన్ ఎం టార్కు విడుదల అవుతుంది. ఇక సీఎన్ జీ ఎంపికతో వాస్తవ అవుట్ పుట్ ను కంపెనీ తెలపలేదు. అయితే ఫ్యాక్టరీ పరీక్షించిన కిట్లు 28.1 కిలోమీటర్ల వరకూ మైలేజీ ఇస్తాయని చెబుతున్నారు.




# మన ఆర్థిక వ్యవస్థకు ఐక్యరాజ్యసమితి కితాబు

భారతీయులందరూ గర్వపడే ఓ విషయాన్ని ఐక్యరాజ్యసమితి వెల్లడిరచింది. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక వ్యవస్థలు అస్తవ్యస్తంగా ఉంటే, భారతదేశం మాత్రం ప్రగతిపథంలో దూసుకుపోతోందని తెలిపింది. ఇది మన పాలకులు, ప్రజలు, వ్యాపారవేత్తల సమర్థతకు నిదర్శనంగా నిలిచింది. ఈ విషయాన్ని ఐక్యరాజ్యసమితి ఓ నివేదికలో వెల్లడిరచింది. దానిలో మన ఆర్థిక వ్యవస్థ పెరుగుదలను కొనియాడిరది. ఈ నివేదికను ఐక్యరాజ్యసమితి ఆర్థిక, సామాజిక వ్యవహారాల విభాగం (డీఈఎస్ఏ)లోని ఆర్థిక విశ్లేషణ, విధాన విభాగంలోని గ్లోబల్ ఎకనామిక్ మానిటరింగ్ బ్రాంచ్ తయారు చేసింది.ఐక్యరాజ్యసమితి నివేదికలో అనేక విషయాలను వెల్లడిరచింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత దేశ ఆర్థిక వృద్ధిని 6.3 శాతంగా అంచనా వేసింది. ఇది పెద్ద దేశాల ఆర్థిక వ్యవస్థ కంటే అత్యధికమని తెలిపింది. ఈ ప్రగతి 2026 వరకూ కొనసాగుతుందని, మొత్తానికి 6.4 శాతం వృద్ధి నమోదయ్యే అవకాశం ఉందని వెల్లడిరచింది. ప్రపంచ ఆర్థిక వృద్ధి 2025లో 2.4 శాతానికి మందగిస్తుందని అంచనా వేసింది.ప్రపంచ వ్యాప్తంగా వాణిజ్య ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. సరిహద్దు వివాదాలు ఎక్కువయ్యాయి. దేశాల విధానాల్లో మార్పులు సంభవించాయి. దీంతో పెట్టుబడుల్లో క్షీణత ఏర్పడిరది. ఇదే సమయంలో భారత దేశంలో అభివృద్ధి గణాంకాలు ఆశాజనకంగా ఉన్నాయి. ఉత్సాహభరితమైన మూలధన మార్కెట్లు, మంచి ఉత్పత్తులు, రికార్డు స్థాయిలో ఎగుమతులు, బలమైన రక్షణరంగం దీనికి ప్రధాన కారణాలుగా చెబుతున్నారు. మంచి విధాన ఎంపికలు, బలమైన దేశీయ డిమాండ్, స్థిరమైన ప్రభుత్వ వ్యయం కూడా మన ఆర్థిక వృద్ధికి కారణాలని చెప్పవచ్చు. వీటితో ప్రజలకు చక్కని ఉపాధి అవకాశాలు ఏర్పడుతున్నాయి. అలాగే ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడానికి దోహదం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో 2025 నాటికి ద్రవ్యోల్బణం 4.3 శాతం తగ్గుతుందని అంచనా వేశారు. మన ఆర్థిక మార్కెట్లు కూడా ప్రగతి పథంలో పయనిస్తున్నాయి. పెట్టుబడిదారులకు స్టాక్ లు లాభాలను ఆర్జించిపెడుతున్నాయి.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లిపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన ఎమ్మెల్యే

**పాలకుర్తి, తెలంగాణ ముచ్చట్లు :**

పాలకుర్తి మండలంలోని చెన్నూరు గ్రామంలో ఏర్పాటు చేసిన ఎఫ్ ఎస్ సి ఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శాసన సభ్యురాలు శ్రీమతి యశస్విని రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా వారు రైతులతో మాట్లాడుతూ ప్రభుత్వ ధాన్యం కొనుగోలు విధానం, మద్దతు ధర అమలు పరిస్థితులు, కేంద్రంలో ఉన్న సౌకర్యాలపై సమీక్ష నిర్వహించారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో జరుగుతున్న కార్యక్రమాలను పరిశీలించిన ఎమ్మెల్యే, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వేగవంతమైన ధాన్యం కొనుగోలు జరుగాలని అధికారులను ఆదేశించారు. తూకంలో పారదర్శకత ఉండాలని, తడిపడిన ధాన్యాన్ని తిరస్కరించకూడదని స్పష్టం చేశారు. అలాగే తక్షణమే ధనరాశిని రైతుల ఖాతాల్లో జమ చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రైతుల నుంచి ఫిర్యాదులు, సూచనలు స్వీకరించిన ఎమ్మెల్యే, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.







# భూ సర్వే ద్వారా సమగ్ర భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం...

**జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

భూ సర్వే ద్వారా సమగ్ర భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. బుధవారం ఎర్రుపాలెం మండలం మొలుగుమాడు గ్రామాన్ని భూసర్వే పైలెట్ ప్రాజెక్టు క్రింద ఎంపిక కాగా, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆకస్మికంగా తనిఖీ చేసి, భూ సర్వే ప్రక్రియపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ బోనకల్, నేలకొండపల్లి మండలాల్లో భూ భారతి చట్టం 2025 ను పైలెట్ ప్రాజెక్టు క్రింద ఎంపిక కాగా, రెండు మండలాల్లోని అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు చేపట్టి, భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించామన్నారు. భూ సమస్యల్లో సర్వే, యాజమాన్యం, వివాదాల పరిష్కారం ఉంటాయని అన్నారు.

గతంలో 1930 సంవత్సరంలో భూ సర్వే జరిగిందని, నేడు అదే భూమిపై వంద మంది యాజమాన్యం వారసత్వంగా ఉండే అవకాశం కూడా ఉందని అన్నారు. భూ భారతి చట్టం ప్రకారం భూమి రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ లో తప్పనిసరిగా సర్వే చేసి మ్యాప్ జత చేయాల్సి ఉంటుందని, దీని కోసం లైసెన్స్ సర్వేయర్లను ఎంపిక చేసి వారికి ప్రభుత్వం చే శిక్షణ అందించి అందుబాటులో పెడుతుందని కలెక్టర్ తెలిపారు.

సాదా బైనామా ద్వారా కొనుగోలు జరిగిన లావాదేవీలు మన ఖమ్మం జిల్లాలో దాదాపు 90 వేల వరకు ఉన్నాయని, ధరణిలో వీటి పరిష్కారానికి ఆస్కారం లేదని, నేడు భూ భారతి చట్టంలో ప్రభుత్వం ఒక మార్గం చూపించిందని, క్షేత్రస్థాయిలో ఎవరు కబ్జాలో ఉన్నారో పరిశీలించి ఆ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అన్నారు.

వారసత్వంగా భూముల యాజమాన్య హక్కుల మార్పు సమయంలో కూడా మమ్మల్ని పిలవలేదు అని గతంలో ఫిర్యాదులు ఉండేవని, నేడు ఆ సమస్య పరిష్కారం కోసం తహసిల్దార్ కుటుంబ సభ్యులను పిలిచి వారి సమక్షంలో ఆర్డర్ పాస్ చేయడం జరుగుతుందని, ఇది నచ్చక పోతే ఆర్డిఓ నుంచి సిసిఎల్ఏ వరకు అంచెలంచెలుగా రెవెన్యూ కోర్టుల్లో అప్పీల్ చేసుకునే అవకాశం ఉంటుందని అన్నారు.

భూ హక్కుల యాజమాన్య ఆర్డర్ లను తహసిల్దార్ 30 రోజుల్లోగా విచారణ చేసి జారీ చేయాలని లేని పక్షంలో ఆటోమేటిక్ గా దరఖాస్తు ప్రకారం ఆర్డర్ పాస్ అవుతుందని అన్నారు.

భూ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా పైలెట్ ప్రాజెక్టు క్రింద ఐదు గ్రామాలలో భూ సర్వే ప్రభుత్వం చేపడుతుందని, నేడు వ్యవసాయ భూములను మాత్రమే సర్వే చేస్తున్నామని, గ్రామ కంఠం, ఇండ్లను సర్వే చేయడం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. అధునాతన సాంకేతికతను వినియోగించి జిపిఎస్ యంత్రాల ద్వారా సర్వే పూర్తి చేసి వివరాలను గ్రామంలో వారం రోజుల పాటు ప్రదర్శిస్తామని అన్నారు. ప్రజల నుంచి అభ్యంతరాలను తీసుకుని వాటిని పరిష్కరించిన తర్వాత శాశ్వత గ్రామ భూ రికార్డు తయారు అవుతుందని అన్నారు. గ్రామంలోని అన్ని సర్వే నెంబర్లు, భూమి నంతటిని సర్వే చేపట్టి, భూముల లెక్క తేల్చనున్నట్లు ఆయన తెలిపారు.

ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట ఏడి సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాసులు, ఎర్రుపాలెం మండల తహసీల్దార్ ఉషా శారద, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





# ఆడపిల్ల పుడితే ఇంటికి భారం కాదు

**జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

ఆడపిల్ల పుడితే భారం కాదు ఇంటికి మణిహారం అని, అమ్మాయితో ఇంటికి మహలక్ష్మి వచ్చిందని భావించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. ఆడపిల్లలు పుట్టడం అదృష్టమని తెలుపుతూ ప్రతి బుధవారం జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న మా పాప మా ఇంటి మణిదీపం కార్యక్రమంలో భాగంగా వైరా మండలం రెబ్బవరం గ్రామంలో అనుషా కుటుంబ సభ్యులు, అంగన్వాడి టీచర్లు, ఆశా కార్యకర్త అందంగా ఇంటిని ఆలంకరించి ఆడపిల్లలను పుట్టనిద్దాం.. ఆడపిల్లలను పెరగనిద్దాం అనే నినాదాలతో ముగ్గులు వేసి కలెక్టర్ కు ఘన స్వాగతం పలికారు. గుత్తా అనుషా వెంకటరామారావు దంపతులకు 10మార్చి, 2025న ఆడపిల్ల పుట్టిన విషయం తెలిసి, వారి ఇంటికి వచ్చిన జిల్లా కలెక్టర్, పాప తల్లిదండ్రులతో పాటు అమ్మమ్మ, తాతయ్య, బంధువులను కలిసి స్వీట్ బాక్స్, ఫ్రూట్స్, సర్టిఫికెట్ అందించి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సన్మానించారు. చేతులతో పాపను ఎత్తుకొని పాప చిరునవ్వుకు కలెక్టర్ మురిసిపోయారు. సమాజానికి ఆడపిల్లల ఆవశ్యకత ఏలాంటిదో వివరించారు. జిల్లా వ్యాప్తంగా ఆధికారులు ఈ కార్యక్రమంలో చిన్నారులను ఆశీర్వదించడం, సంతృప్తి కలుగుతుందని సంతోషాన్ని పంచుకున్నారు. కలెక్టర్ మా పాప మా ఇంటి మణిదీపం ఆలోచనతో పాటు ఆచరణ పట్ల గ్రామస్థులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ అమ్మాయిలను మగవారితో సమానంగా విద్య, వైద్యం, న్యాయం, సంరక్షణ, సామాజిక ఎదుగుదల అంశాల పై అవకాశాలు కల్పించాలని అన్నారు. ఆడపిల్లలే ఇంటికి మణి దీపాలు ప్రస్తుత ఆధునిక యుగంలో అన్ని రంగాలలో పురుషులతో సమానంగా పోటీపడుతూ దూసుకెళ్తున్న మహిళలు ఏ రంగంలో తక్కువ కాదు అని నిరూపిస్తున్నారని అన్నారు. కుటుంబ వ్యవస్థలో, సమాజం అత్యాధునిక అభివృద్ధి పథంలో కొనసాగటానికి ప్రధాన భూమిక మహిళలదే అని. మహిళలను బాల్యం నుండే ప్రోత్సహించి దేశ అభ్యున్నతికి అందరూ కృషి చేయాలని తెలియజేశారు. ఆడబిడ్డలను గొప్ప స్థానంలో ఎదిగేందుకు ఎవరికి తక్కువ కాకుండా పెంచాలని, మనం ఆశించే మార్పు మన ఇంటి నుండే ప్రారంభించాలని, ఆడబిడ్డ కుటుంబానికి అమ్మగా ఉంటుందని, అన్ని బంధాలకు మాతృప్రేమ పంచేవారని అన్నారు. సమాజంలో అమ్మాయి పుడితే అదృష్టంగా భావించాలని కలెక్టర్ సూచించారు. మహిళా శిశు సంక్షేమం కోసం ప్రభుత్వాలు అనేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని, జిల్లాలో ఏ ఇంట్లో ఆడపిల్ల పుట్టినా జిల్లా అధికారులు వెళ్లి తల్లిదండ్రులకు స్వీట్ బాక్స్ ఇచ్చి, మంచి సందేశం అందించాలని, మహాలక్ష్మి ఇంట్లో పుట్టినందుకు శుభాకాంక్షలు తెలిపాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామని కలెక్టర్ తెలిపారు. అనంతరం పాప తల్లిదండ్రులు మాట్లాడుతూ, మా ఇంటికి కలెక్టర్ వచ్చి మా పాపకు ఆశీస్సులు అందించి, పాప భవిష్యత్తు గురించి చెప్పడం ఎంతో సంతోషంగా ఉందని, కలెక్టర్ చెప్పిన విధంగా మా పాపను మంచిగా చదివించి ఉన్నత స్థాయిలో ఉండే విధంగా తీర్చిదిద్దుతామని, పాప పెద్దయిన తర్వాత ఇంటికి కలెక్టర్ గారే స్వయంగా వచ్చి దీవించి వెళ్లారని తెలిపి ఈ నాటి మధుర క్షణాలను పంచుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి కె. రాంగోపాల్ రెడ్డి, సాంఘీక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కస్తాల సత్యనారాయణ, వైరా తహసీల్దార్ శ్రీనివాస్ రావు, ఐసిడిఎస్ సూపర్వైజర్ శ్రీలక్ష్మి, ఆశా కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ మెదక్ పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి గడ్డమీద కృష్ణ గౌడ్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన. మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు

**మెదక్ బ్యూరో తెలంగాణ ముచ్చట్లు.**

మాజీ మంత్రివర్యులు సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు. హరీష్ రావు బుధవారం శంకరంపేట ఆర్ మండలంలో ప్రోగ్రామ్ ముగించుకొని సంగారెడ్డి వెళ్తుండగా మెదక్ పట్టణంలోని 13వ వార్డు తాజా మాజీ కౌన్సిలర్ సులోచన ప్రభూ రెడ్డి వారి నివాసంలో పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి గడ్డమీద కృష్ణ గౌడ్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో మెదక్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరి.సుభాష్ రెడ్డి, రాష్ట్ర నాయకులు కంఠరెడ్డి.తిరుపతిరెడ్డి, మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఆరేళ్ల. మల్లికార్జున్ గౌడ్, మాజీ కౌన్సిలర్లు బిమరి. కిషోర్ ఆర్కే. శ్రీనివాస్, సులోచన ప్రభు రెడ్డి తదితరులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



# పేదవాడి కళ్ళల్లో ఆనందమే చూడటమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

**ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**

ప్రతి పేదవాడి కళ్ళల్లో ఆనందం చూడడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని వనపర్తి ఎమ్మెల్యే తుడి మేఘా రెడ్డి పేర్కొన్నారు.బుధవారం వనపర్తి పట్టణంలోని కళ్యాణ సాయి గార్డెన్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని,లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్,సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు.ఈ కార్యక్రమంలో పెద్దమందడి మండలం వెలటూరు గ్రామానికి చెందిన ఎన్.మంజుల (భర్త రాములు) కి కళ్యాణ లక్ష్మి చెక్కు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు కలగాలని ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.



గ్రామాభివృద్ధి సామాజిక సమానత్వం కోసం ప్రభుత్వం విస్తృతంగా పనిచేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెలటూరు గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, వైస్ చైర్మన్ కొత్త కాపు రామకృష్ణారెడ్డి, తిరుపతి రెడ్డి, గట్టు యాదవ్, టైలర్ రవి తదితరులు పాల్గొన్నారు.

## బత్తుల వీరయ్య సతీమణి మృతి పట్ల మాజీ ఎంపీ నామ సంతాపం

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, సుజాతనగర్ మండల బిఆర్ఎస్ నాయకులు, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ బత్తుల వీరయ్య సతీమణి త్రివేణి మృతి పట్ల బిఆర్ ఎస్ మాజీ లోక్ సభాపక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వర రావు సంతాపం తెలిపారు . ఈ విషాద సమయంలో బత్తుల వీరయ్య కుటుంబానికి ధైర్యాన్ని, మనోబలాన్ని దేవుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. బత్తుల వీరయ్య కుటుంబానికి నామ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 163 బి ఎన్ ఎస్ ఎస్ అమలు

**పోలీస్ కమిషనర్ సునీల్ దత్**

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

మే 22నుండి 29వరకు ఖమ్మం కమిషనరేట్ పరిధిలోని 38 పరీక్ష కేంద్రాలలో నిర్వహించే ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల సందర్భంగా అయా పరీక్ష కేంద్రాల వద్ద ఉదయం 8:00గంటల నుండి సాయంత్రం 6:30వరకు సెక్షన్ 163 బి ఎన్ ఎస్ ఎస్ యాక్ట్ 2023 (భారతీయ నాగరిక్ సురక్షా సంహిత) అమలులో వుంటుందని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో పరీక్ష కేంద్రాలకు 200 మీటర్ల దూరం వరకు ఐదుగురికి మించి గుంపులుగా వుండరాదని సూచించారు. అదేవిధంగా ఏలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలకు,



మైకులు, డిజేలతో ఉరేగింపులు, దర్నలు, ప్రచారాలు నిర్వహించరాదని పెర్కొన్నారు. పరీక్ష సమయంలో పరిసరాలలోని ఇంటర్నెట్ సెంటర్స్, జిరాక్స్ షాపులు, స్టేషనరీ దుకాణాలు మూసివేయాలని సూచించారు. పరిక్ష సమయంలో ఎటువంటి ఆటంకాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా 163 సెక్షన్ అమలు చేస్తున్నట్లు పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ నేపథ్యంలో వివిధ వర్గాల ప్రజలు, రాజకీయ పార్టీలు, వివిధ సంఘాల నాయకులు పోలీసులకు సహకరించాలని సూచించారు. అదేవిధంగా పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు తో పాటు ట్రాఫిక్ ఆంతరాయం కలగకుండా ట్రాఫిక్ పోలీసులు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలలో పోలీస్ పెట్రోలింగ్ పార్టీలను నియమించినట్లు తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసేందుకు నిఘాను నియమించి సమాచారం సేకరించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలున తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.




# రాజీవ్ గాంధీ సేవలు మరువలేనివి

- **ఆధునిక భారత నిర్మాత యువ రాజకీయానికి మార్గదర్శి**
- **శ్రీ రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ఘన నివాళి అర్పించిన ఆవుల రాజిరెడ్డి.**

**మెదక్ బ్యూరో, నర్సాపూర్ తెలంగాణ ముచ్చట్లు.**

నర్సాపూర్ పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో, భారతదేశం యొక్క ఐటి విప్లవానికి ఆధునికీకరణకు పునాది వేసిన మహానాయకుడు, మాజీ ప్రధాని స్వర్గీయ శ్రీ రాజీవ్ గాంధీ గారి వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళుల ర్పించారు పిసిసి ప్రధాన కార్యదర్శి నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి శ్రీ ఆవుల రాజిరెడ్డి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాజీవ్ గాంధీ నూతన భారత నిర్మాణానికి సాంకేతికత, విద్య, యువశక్తికి అధిక ప్రాధాన్యం ఇచ్చారు. ఆయన స్మృతులను జ్ఞాపకంగా ఉంచుకుంటూ, ఆయన ఆశయ సాధన దిశగా నడవడం మన బాధ్యత" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ గారు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# పండుగలు సోదర భావంతో జరుపుకోవాలి

**టౌన్ ఏసీపీ రమణమూర్తి**

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**
మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే ఖమ్మం జిల్లాలో బక్రీద్, హనుమాన్ జయంతి పండుగను సోదర భావంతో జరుపుకోవాలని టౌన్ ఏసీపీ రమణమూర్తి అన్నారు.
పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల బక్రీద్ పండుగ, హనుమాన్ జయంతి పురస్కారించుకొని ఎలాంటి శాంతిభద్రతల తలెత్తకుండా శాంతియుత వాతావరణంలో జరుపుకోవడానికి ఖమ్మం టౌన్ ఏసీపీ ఆధ్వర్యంలో బుధవారం ఖమ్మం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో పీస్ కమిటీ సభ్యులతో శాంతి సమావేశం నిర్వహించారు. ఖమ్మం టూ టౌన్ ,ఖానాపురం హవేలీ,త్రీ టౌన్ పోలీస్ స్టేషన్లలో కూడా సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.
ఈ సందర్భంగా టౌన్ ఏసీపీ మాట్లాడుతూ ..బక్రీద్ ,హనుమాన్ జయంతి పండుగ పర్వదినాలను శాంతియుత వాతావరణంలో పరస్పరం మతాలను గౌరవించుకుంటూ పండుగ జరుపుకోవాలని సూచించారు. ముఖ్యంగా సరిహద్దు రాష్ట్రాల మీదుగా వచ్చే పశువుల అక్రమ రవాణా కట్టడికి కమిషనరేట్ పరిధిలో పశుసంవర్ధక శాఖ సిబ్బందితో 7 చెక్ పోస్ట్ లు ఏర్పాటు చేసి పశువులను రవాణాచేసే ప్రతి వాహనానికి తగు నిర్ధారిత ప్రమాణిక పత్రాలు (వాలిడ్ డాక్యుమెంట్స్) ఉంటేనే, పరిశీలించి అనుమతిస్తారని అన్నారు. ప్రధానంగా నిబంధనలు విరుద్ధంగా పశువులు అక్రమ రవాణా జరిగితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, చట్టాన్ని ఏవరు కూడా తమ చేతుల్లోకి తీసుకొని శాంతిభద్రతలకు విఘాతం కల్పించే పరిస్థితులు తీసుకొనిరావద్దని అన్నారు. ఏదైనా సమస్య వుంటే సామరస్య పరిష్కారానికి పోలీస్ అధికారులు నిరంతరం అందుబాటులో వుంటారని అన్నారు. ముఖ్యంగా యువత ఆవేశంతో చేస్తున్న చిన్న తప్పులు శాంతి భద్రతల సమస్యగా తలెత్తె ప్రమాదం వుంటుంది కాబట్టి వివిధ వర్గాల మతపెద్దలు యువతకు సమన్వయం పాటించేలా దిశానిర్దేశం చేయాలని అన్నారు. ప్రధానంగా నగరంలో ఏ చిన్న సంఘటన జరిగిన ఎడిటింగ్ చేసి సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజల ఐక్యతను, సామరస్యానికి భంగం కలిగించే విధంగా విద్వేషాలు, రెచ్చగొట్టే, అసభ్యకర పోస్టులు పెట్టడం తద్వారా శాంతి భద్రతల సమస్య సృష్టించే ప్రయత్నం చేస్తున్న వారిపై పోలీస్ మీడియా మానిటరింగ్ సెల్ నిఘా పెట్టిందని తెలిపారు. అదేవిధంగా సభలు, సమావేశాలు,ర్యాలీలకు ఖచ్చితంగా పోలీసుల అనుమతి తీసుకోవాలని, తద్వారా అవసరమైన భద్రతను కల్పించేందుకు దోహదపడుతుందని అన్నారు.
ఈద్గా ప్రాంతాలలో ముస్లిం సోదరుల సామూహికంగా ప్రార్థన కోసం వచ్చే భక్తులకు ఏలాంటి ఇబ్బందులు కలగ కుండా ట్రాఫిక్ ,పార్కింగ్ , పోలీస్ బందోబస్తు ఏర్పాటుకు ప్రత్యేక చోరవ తీసుకోవడం జరుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా వివిధ మత పెద్దలు తమ అభిప్రాయాలను వెల్లడించి పోలీసు తీసుకుంటున్న ముందస్తు జాగ్రత్త చర్యకు తమవంతు సహకాహారం అందజేస్తామని అన్నారు. సమావేశంలో ఇన్స్‌పెక్టర్ కరుణాకర్, ఎస్సై మౌలానా పాల్గొన్నారు.







## నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలి..

**జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్.**

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**
ఖమ్మం నగరాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్, 57వ డివిజన్ లో పర్యటించారు. స్థానిక కార్పోరేటర్ రఫిదా బేగం ముస్తఫా, అధికారులతో కలిసి రమణగుట్ట, వికలాంగుల కాలనీ, జగ్జీవన్ రాం కాలనీలోని పలు ప్రాంతంలో పర్యటించి పారిశుధ్య నిర్వహణ తీరును పరిశీలించారు. కలెక్టర్ కాలి నడకన నడిచి ఆ ప్రాంతాలలో శానిటేషన్, త్రాగునీరు, విద్యుత్ స్తంబాలు, సైడ్ కాలువలు, డ్రైనేజి, రోడ్లు తదితర అంశాలపై అడిగి తెలుసుకున్నారు. ఓపెన్ ల్యాండ్ లను పరిశీలించి చెత్త పేరుకొని పోకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఖాళీ ప్రాంతాలలో నిలిచిన మురుగు నీటి పరిస్థితులను చూసి ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తక్షణమే శుభ్రత చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థతో బురదకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ తెలిపారు. వికలాంగుల కాలనీలో శిధిలావస్థలో ఉన్న పాఠశాలను తొలగించి కొత్త భవన నిర్మాణానికి ప్రతిపాదనలను సమర్పించాలని విద్యాశాఖ అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. స్థానిక పిల్లలకు విద్యా బోధనకు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి ఎస్. సత్యనారాయణ, ఖమ్మం అర్బన్ మండల తహసీల్ధార్ సైదులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జాబ్ మేళా ను సద్వినియోగం చేసుకోండి

- **దళిత రత్న అవార్డు గ్రహీత వైరా మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ జిల్లా కాంగ్రెస్ నాయకులు వేల్పుల మురళి**

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**
వైరాలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఈనెల 24న ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా నిరుద్యోగులకు సింగరేణి కాలరీస్ సహకారంతో డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క చొరవతో స్థానిక ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు పదవ తరగతి ఇంటర్మీడియట్ డిగ్రీ పీజీ చేసిన విద్యార్థులకు చక్కటి అవకాశాన్ని వినియోగించుకోవాలని దళిత రత్న అవార్డు గ్రహీత వైరా మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ జిల్లా కాంగ్రెస్ నాయకులు వేల్పుల మురళి నిరుద్యోగులను కోరారు. ఈ చక్కటి అవకాశాన్ని ఐదువేల ఉద్యోగాలతో 80 ప్రవేట్ కంపెనీల సహకారంతో వైరాలో చాలా బ్రహ్మాండంగా ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నారు ఈ అవకాశాన్ని సర్టిఫికెట్లతో మీరు ఇంటర్వ్యూకి వచ్చి మీరందరూ వినియోగించుకోవాలని మీ అర్హతను బట్టి ఉద్యోగం సంపాదించి మీ కుటుంబానికి అండగా ఉండాలని ఏర్పాట్లను స్వయంగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ దుర్గాప్రసాద్ పిసిసి కార్యదర్శి నూతి సత్యనారాయణ ఏ ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నారని వారు తెలిపారు.



## తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

**ఖాజీపెట్ తెలంగాణ ముచ్చట్లు**
తెలంగాణ జర్నలిస్టుల దిక్సూచి అల్లం నారాయణ నాయకత్వం లో తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పురుడు పోసుకున్న తెలంగాణ జర్నలిస్టుల ఫోరం రజతోత్సవాలను విజయవంతం చేయాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్( H143) హనుమకొండ జిల్లా నాయకులు పిలుపునిచ్చారు.
తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం మే 31వ తేదీలో ఆవిర్భవించి 25 వ వసంతంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా హైదరాబాద్ జల విహార్ లో నిర్వహిస్తున్న సంబరాల గోడపత్రిక ఆవిష్కరణ కార్యక్రమం బుధవారం కాజీపేట మీడియా పాయింట్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్, రాజ్ కుమార్ లు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం నిర్వహించిన చారిత్రాత్మక పాత్రను తెలియజేయడం కోసం మే 31న టీ. జే. ఎఫ్ రజతోత్సవాలను నిర్వహిస్తుందని వారు తెలిపారు. తెలంగాణ కోసమే తెలంగాణ జర్నలిస్టులు నినాదం తో 2001 మే 31న ఆవిర్భవించిన తెలంగాణ జర్నలిస్టుల ఫోరం తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు 2014 వరకు అన్ని వర్గాల ప్రజలను,ఉద్యమ సంఘాలను సంఘటితం చేసిన ఘనత టీజేఎఫ్ దని గుర్తు చేశారు. ఇంతటి చారిత్రక నేపథ్యం కలిగిన జర్నలిస్ట్ ఫోరం రజతోత్సవ సంబరాలకు హన్మకొండ జిల్లా నుండి జర్నలిస్ట్ లు అధిక సంఖ్యలో తరలివచ్చి విజవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బత్తిని రాజేందర్, అలువల నరేందర్, కటుకూరి రవి కుమార్, కే. కుమారస్వామి, కాడే శ్రీహరి ఆదర్శ్, బి. వెంకట్ స్వామి, టి. శ్యామ్, బుర్ర శ్రీనివాస్, షకీర్, కె. కిశోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు




# సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

- **బాల్య వివాహల నిర్మూలన అవగాహన పోస్టర్ ఆవిష్కరణ**
- **జిల్లా ఎస్పీ రావుల గిరిధర్**

**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:**
భావి సమాజ నిర్మాతలు నేటి ఉపాధ్యాయులని, సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, ఉపాధ్యాయులలో అనంతమైన శక్తి దాగి ఉంది విద్యార్థులకు బోధించి శక్తివంతులుగా తీర్చిదిద్దాలని వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు.వనపర్తి జిల్లా కేంద్రంలోని ఉర్దూ బాలుర,బాలికల ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఐదు రోజుల వృత్యంతర శిక్షణలో భాగంగా రెండవ రోజు బుధవారం ఏ హెచ్ టి యు,సఖి, భరోస వారి ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థులకు డ్రగ్స్, బాల్యవివాహాలు, సైబర్ నేరాలు, గురించి అవగాహన కల్పించి విద్యార్థులకు బోధించి వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించే విధంగా ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... తరగతి గదిలో దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే పౌరులను తయారు చేసే నిర్మాతలు గురువులని పేర్కొన్నారు. సమాజంలో విద్యార్థులను ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని , వారికి స్పష్టమైన దిశ,దశను నిర్దేశించి వారిని ఉన్నత లక్ష్యాల వైపు తీసుకెళ్లాల్సిన గురుతర బాధ్యత నేటి ఉపాధ్యాయులపై ఉందని తెలియజేశారు.ఒకనాటి పిల్లల బాల్యం నేటి పిల్లల బాల్యంలో చాలా వ్యత్యాసం ఉందని ఆయన చెప్పారు.ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రధానంగా క్రమశిక్షణతో పాటు సంస్కారాన్ని నేర్పాలని కోరారు. తల్లిదండ్రులు గురువులు తోటి సమాజాన్ని గౌరవించే విధానం చిన్నప్పటి నుంచే పిల్లల్లో అలవడాలని అన్నారు. అంతేకాక బాల్య వివాహాలు, నిరక్షరాస్యత డ్రగ్స్ , సైబర్ నేరాలు,చెడువ్యసనాలపై తల్లిదండ్రుల సమావేశం రోజున పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని అన్నారు.ముఖ్యంగా ఆడపిల్లలతో అసభ్యంగా ప్రవర్తిస్తే షి టీం నిఘా వ్యవస్థ ఎప్పుడూ గమనిస్తూ ఉంటుందని, ఫోక్సో చట్టం కింద కేసులు నమోదు చేసే విషయాలను తెలియజెప్పాలని ఎస్పీ వివరించారు. ఉత్తమ ఉపాధ్యాయులు విద్యార్థుల గుండెల్లో ఎప్పటికీ గుర్తుంచుకుంటారని అందుకు ప్రతి ఉపాధ్యాయుడు తన వంతు కృషి చేయాలని ఆయన తెలిపారు.వనపర్తి జిల్లాలో విద్యని బలోపేతం చేసి పాఠశాలలలో విద్యార్థుల సంఖ్యని పెంచి నాణ్యమైన విద్యను అందించి రాష్ట్ర స్థాయి ఫలితాలలో ఉత్తమ స్థానాన్ని సాధించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా రిసోర్స్ పర్సన్స్,శ్రీనివాసులు,ఐ.సుదర్శన్ రావు,మల్లేశ్,మరియు సెంటర్ ఇంచార్జి శ్రీమతి జ్యోతి శిక్షణ కోర్స్ డైరెక్టర్ లు జ్యోతి,ఆనంద్,ఉమాదేవి, రూరల్ డెవలప్మెంట్ సొసైటీ జిల్లా అధ్యక్షురాలు, చెన్నమ్మ తామస్, సఖీ సెంటర్ అడ్మినిస్టేటర్. కవిత,సెక్టోరియల్ అధికారులు,యుగంధర్,శేఖర్ డి ఎస్ ఒ శ్రీనివాసులు,ఏ హెచ్ టి యు ఎస్సై, అంజద్, భరోస సెంటర్ సిబ్బంది, తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.






## రాజీవ్ యువ వికాసం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ వేగవతం చేయాలి

**వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:**
వనపర్తి జిల్లా కలెక్టర్ తన చాంబర్ లో బుధవారం రాజీవ్ యువ వికాసం లబ్ధిదారుల ఎంపిక పురోగతి పై అధికారులతో బేటీ అయ్యారు. రాజీవ్ యువ వికాసం కిందా ఉద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు వనపర్తి జిల్లాకు మొత్తం126. 36 కోట్లు సబ్సిడీ రూపంలో మంజూరు కాగా28110 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో వనపర్తి నియోజవర్గానికి రూ 7203 కోట్లు మంజూరు కాగ15388 దరఖాస్తులు వచ్చాయి. మక్తల్ నియోజవర్గానికి సంబంధించి1400 కోట్లు మంజూరు కాగా3114 దరఖాస్తులు రావడం జరిగింది. దేవరకద్ర నియోజకవర్గంలో4334 మంది దరఖాస్తులు చేసుకోగా9.24 కోట్లు నిధులు మంజూరు అయ్యాయి కొల్లాపూర్ నియోజవర్గానికి రూ₹22.19 కోట్లు మంజూరు చెయ్యగా 5274 దరఖాస్తులు వచ్చాయి.ఎస్సీ,ఎస్టీ మైనారిటీ శాకలకువచ్చిన దరఖాస్తును క్షుణ్ణంగా తనిఖీ చేసి అర్హులైన లబ్ధిదారుల ఎంపీక మే చివర నాటికి పూర్తి చేయాలి సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, వనపర్తి జిల్లా జడ్పీ సీఈఓ ఇంచార్జ్ లోకల్ బాడీ స్థానిక సంస్థల కలెక్టర్ యాదయ్య,పి డి ఆర్ డి ఓ ఉమాదేవి. బీసీ సంక్షేమ అధికారి ఇందిరాఎస్సీ కార్పొరేషన్ ఈ డి మల్లికార్జున్, మైనారిటీ కార్పొరేషన్ అధికారి అఫ్జలుద్దీన్,మీడియా పౌర సమాచార అధికారి సీతారాం నాయక్,తదితరులు పాల్గొన్నారు.



## రజక విద్యార్థులకు ప్రతిభా అవార్డులు

**హన్మకొండ,తెలంగాణ ముచ్చట్లు:**
ఉమ్మడి వరంగల్ జిల్లాలోని రజక ఎంప్లాయిస్ వెల్ఫేర్ సొసైటీ 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి పదవ తరగతిలో 560కు పైగా మార్కులు సాధించిన రజక విద్యార్థినీ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందించనున్నది.
ఈ విషయాన్ని సంఘం జిల్లా అధ్యక్షుడు ఉల్లెంగల కొమురెల్లి, ప్రధాన కార్యదర్శి పంతంగి సమ్మయ్యలు ఒక ప్రకటనలో వెల్లడించారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, కస్తూరిబా, మోడల్ స్కూల్, సాంఘిక సంక్షేమ, గురుకుల పాఠశాలల్లో చదివిన విద్యార్థులకే ఈ అవార్డులు వర్తిస్తాయి.
అర్హులైన విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల పదవ తరగతి మార్కుల మెమో, ప్రధానోపాధ్యాయుల ధృవీకరణపత్రం, కుల ధృవీకరణ, నివాస ధృవీకరణ పత్రాలతో పాటు రెండు పాస్‌పోర్టు పరిమాణంలో చిత్రాలను 28.05.2025లోపు పంపించాలి. దరఖాస్తులను 9441454284 లేదా 9491821598 అనే వాట్సాప్ నెంబర్లకు పంపవచ్చు.పురస్కార కార్యక్రమానికి సంబంధించిన తేదీ, ప్రాంగణాన్ని త్వరలో ప్రకటించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక




# నిర్లక్ష్యపు మంటల్లో బూడిదైన జీవితాలు

హైదరాబాద్ నగరంలోని చార్మినార్ సమీపంలో సందడిగల గుల్జార్ హౌజ్‌లో జరిగిన అగ్నిప్రమాదం కేవలం ఒక దుర్ఘటన కాదు. అది వ్యవస్థాగత వైఫల్యా లకు, బాధ్యతారాహిత్యానికి, సమాజంలో పాతుకు పోయిన నిర్లక్ష్యపు ధోరణికి నిలువెత్తు నిదర్శనం. ఈ ప్రమాదంలో పదిహేడు మంది మరణించడం, అందులో ఏడేండ్లలోపు పిల్లలు ఉండడం, ఒక గుజరాతీ బనియా కుటుంబానికి చెందిన ముగ్గురు క్షణాల్లో కాలి బూడిదవ్వడం అత్యంత విషాదకరం. వారి కలలు, ఆశలు, జీవితాలు ఆ మంటల్లో కలిసిపోయాయి. ఈ దుర్ఘటన తీవ్రంగా కలచివేస్తోంది. మృతుల పట్ల ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తూనే, ఈ ప్రమాదానికి దారితీసిన పరిస్థితులను మానవీయ కోణంలో విశ్లేషిస్తూ, విమర్శనాత్మక దృష్టితో పరిశీలించాల్సిన సమయమిది. వార్తాపత్రికలు, న్యూస్‌చానెళ్లు, యూట్యూబ్ వీడియోల్లో చూసిన దృశ్యాలు భయానకంగా ఉన్నాయి. ఇరుకైన ప్రవేశ ద్వారం, అగ్నికీలలు నలువైపులా వ్యాపి స్తుండగా ప్రాణాల కోసం ఆర్తనాదాలు, సహాయం కోసం నిస్సహాయంగా ఎదురు చూపులు మనసులను కలచివేస్తాయి. ఇది కేవలం ఒక ప్రమాదం కాదు, అనేక తప్పిదాల పరంపర. అనుమతులు లేకుండా నిర్మించిన షాప్ కమ్ రెసిడెన్షియల్ భవనం, షాపు గుండానే రాకపోకలు సాగించే మార్గం, అగ్ని ప్రమాదాలను నివారించే కనీస చర్యలు కూడా లేకపోవడం - ఇవన్నీ బాధ్యతారాహిత్యానికి పరాకాష్ట.ఇక్కడ భవన నిర్మాణ నిబంధనల ఉల్లంఘనను మాత్రమే చూడడం లేదు. ఒక కుటుంబం భద్రతపై, వారి ప్రాణాలపై చూపిన నిర్లక్ష్యాన్ని కూడా చూస్తున్నాం. జ్యువలరీ, పెరల్స్ వంటి అత్యంత విలువైన వ్యాపారం నిర్వహిస్తున్నా, కనీస భద్రతా చర్యలు తీసుకోకపోవడం వారి ఆలోచనా విధానాన్ని ప్రశ్నిస్తోంది. డబ్బు సంపాదనే పరమావధిగా భావించి, మనుషుల ప్రాణాలకు విలువనివ్వని ఇలాంటి ధోరణి సమాజానికి ఎంత ప్రమా దకరమో ఈ ఘటన తెలియజేస్తోంది. "జుగాడ్ కి జిందగీ" అనే ఒక రకమైన తాత్కాలిక, నిర్లక్ష్యపు జీవన విధానం సమాజంలో చాలా మందికి అలవాటుగా మారిపోయింది. చట్టాలను, నిబంధనలను పట్టించు కోకుండా, ఏదో ఒక విధంగా తమ పనిని పూర్తి చేసుకోవాలనే ఆలోచన చాలా ప్రమాదకరం. నిబంధనలకు విరుద్ధంగా ఇల్లు నిర్మించడం, సమాజంతో సంబంధం లేకుండా తమ ప్రపంచంలో తాము బతకడం, ప్రమాదాలపై కనీస అవగాహన లేకపోవడం, ప్రభుత్వ వ్యవస్థను తక్కువగా చూడడం వంటివి వారి నిర్లక్ష్యాన్ని తెలియజేస్తున్నాయి. ప్రభుత్వం సరిగా స్పందించలేదని వారు చేసిన వ్యాఖ్య వారి బాధ్యతారాహిత్యాన్ని మరింత స్పష్టం చేస్తోంది. తమ తప్పుల వల్లే ఈ ప్రమాదం జరిగిందని గుర్తించకపోవడం వారి బాధ్యతా యుతమైన నిర్లక్ష్యానికి నిదర్శనం.ప్రమాదం ఎప్పుడూ దురదృ ష్టకరమైనదే. కానీ, ఇది మానవ తప్పిదాల ఫలితం. ప్రాణాలు కోల్పోయిన వారికి ఎక్స్‌గ్రేషియా ఇవ్వడం మానవత్వం దృష్ట్యా మంచిదే అయినా, ఈ ప్రమాదానికి కారణ మైన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవడం కూడా అంతే ముఖ్యం. శిక్ష లేకపోతే ఇలాంటి నిర్లక్ష్య పూరిత ధోరణులు కొనసాగుతూనే ఉంటాయి.ఈఒక్క భవనమే కాదు, నగరాలు, పట్టణాల్లో అనేక అక్రమ నిర్మాణాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. అది □కారులు కండ్లు మూసు కుని ఉండడం లేదా అవినీతికి పాల్పడుతుండడంతో ఇలాంటి వాటిని అరికట్టలేక పోతున్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఇలాంటి వారిపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలి. అగ్ని ప్రమాదాలు జరగకుండా ఉండాలంటే ఇండ్లు, షాపింగ్ కాంప్లెక్సులు నిర్మించే టప్పుడు కచ్చితమైన భవన నిర్మాణ నిబంధనలు పాటించాలి. ప్రతి భవనంలో తప్పని సరిగా అగ్నిమాపక వ్యవస్థ ఉండాలి. అత్యవసర నిష్క్రమణ మార్గాలు స్పష్టంగా ఏర్పాటు చేయాలి. ప్రజలకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించాలి. అగ్ని ప్రమాదం సంభ వించినప్పుడు ఎలా స్పందించాలో శిక్షణ ఇవ్వాలి. ముఖ్యంగా, ప్రమాదాలు జరిగే అవ కాశం ఉన్న పాత భవనాలు, ఇరుకైన ప్రాంతాల్లోని నిర్మాణాలపై ప్రభుత్వం ప్రత్యేక నిఘా ఉంచాలి. వాటిని క్రమం తప్ప కుండా తనిఖీ చేయాలి. నిబంధనలు ఉల్లంఘిం చిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. జరిమానాలు విధించాలి, అవసరమైతే కూల్చి వేయ డానికి కూడా వెనుకాడకూడదు.గుల్జార్ హౌజ్ విషాదం మన కండ్లను తెరిపించాలి. చట్టాలను గౌరవించడం, బాధ్యతాయుతంగా ప్రవర్తించడం మనందరి కర్తవ్యం. ప్రభు త్వం తన బాధ్యతను విస్మరించకుండా, కఠినమైన చర్యలు తీసుకున్నప్పుడే భవిష్యత్తులో ఇలాంటి విషాదాలు జరగకుండా నివారించగలం. బూడిదైన కలలు, వెలుగులేని జీవితాలు మనకు ఒక హెచ్చరికగా నిలవాలి.

# దళిత జనబాంధవుడు భాగ్యరెడ్డి వర్మ



అంటరాని తనంపై ఆయన అలుపెరుగని పోరాటం చేశాడు. బాబా సాహెబ్ అంబేద్కర్ తో కలసి ఉద్యమాల్లో పాల్గొన్నాడు. జాతిపిత మహాత్ముని చే గౌరవింప బడినాడు. తాను నమ్మిన సత్యాలను అందరికీ తెలిపి సమాజంలో చైతన్యం తేవడానికి నిస్వార్థసేవ చేశాడు. దళిత స్త్రీల స్థాయిని దిగజార్చి, దేవాలయాల్లో దేవతలకు అంకితమైన అవివాహిత మహిళలు దేవదాసీలుగా, జోగినులుగా, పార్వతు లుగా, జీవితాలను అంకితం చేసే జోగినీ వ్యవస్థ రద్దు, బాల్య వివాహాల వ్యతిరేకత, దళితులలో విద్యా వ్యాప్తి, అసమానత లేని సమాజం కోసం అవిశ్రాంత కృషి చేశాడు. మేము పంచములం కాదు.. ఈ దేశ మూల వాసులం.. ఆది హిందు వులం..' అని గర్వంగా చాటాడు. అంటరాని వారుగా దూరంగా ఉంచ బడిన వారిని ''ఆది హిందువులు''గా భారత దేశంలో తొట్ట తొలుత నివసించిన సంతతిగా ఆయన నొక్కి చెప్పాడు. నిజాం పాలిత హైద రాబాద్ రాజ్యంలో దళితో ద్యమానికి బాటలు వేసిన ఆ మహానేతనే భాగ్యరెడ్డి వర్మ. హరిజన పదం తెలంగా ణ ప్రాంతంలో వ్యాప్తిలో లేని కాలంలో ఆది హిందువు లుగా, ఆది ఆంధ్రులుగా, ఆది భారతీయులుగా నిమ్నవర్గ ప్రజలు తమను తాము ప్రకటించు కోవాలని కాశీనాథుని నాగేశ్వర రావు పంతులు, మాడపాటి హనుమంతరావుల సహకారంతో భాగ్యరెడ్డి వర్మ ప్రచారం చేశాడు. భాగ్యరెడ్డి వర్మ సేవలు హైదరాబాద్ సంస్థానానికే పరిమితం కాక, తెలుగు నేలపై పలు ప్రాంతాలకూ విస్తరించాడు. లక్నో, అలహాబాద్, కలకత్తా తదితర ప్రాంతాల్లో జరిగిన దళిత చైతన్య మహాసభలకు ముఖ్య అతిథిగా హాజరయ్యాడు. దళిత వైతాళికుడుగా ప్రసిద్ధి చెందిన భాగ్యరెడ్డి వర్మ (మే 22, 1888 ఫిబ్రవరి 18, 1939) సంఘ సంస్క ర్త, ఆది ఆంధ్ర సభ స్థాపకుడు. హైదరాబాదు సంస్థా నంలో 26 దళిత బాలికల పాఠశాలలను స్థాపించి, వారి అభ్యున్నతికి గట్టి పునాదులు వేశాడు. జగన్మిత్ర మండలి, మన్య సంఘం, సంఘ సంస్కార నాటక మండలి, అహింసా సమాజంలను స్థాపించి హైదరా బాదు ప్రాంతంలో సంఘ సంస్కర ణలకై కృషి చేశాడు.మాదరి వెంకయ్య, రంగమాంబ దంపతులకు 1888 సంవత్సరం, మే 22వ తేదీన జన్మించిన భాగ య్యకు,1888 నవంబరులో వారి కుటుంబ గురువు భాగయ్యకు బదులు భాగ్యరెడ్డి అని నామ కరణం చేశాడు. ఆయన కుల శైవమత గురువు బోధనలు చేసేవారు. ఆర్యులు హిందూ దేశానికి వలస రాకముందు, అస్పృశ్యులుగా సమాజంచే ముద్ర వేయబడిన ఆది హిందువులే పాలకులని గురువు వాదం. ''రెడ్డి'' అన్నది పాలకుడనే అర్థం గల ''రేడు'' అనే పదం నుంచి ఉద్భవించిందని, అందుచేతనే మాదిరి వెంకయ్యగారి భాగ్యయ్యకు రెడ్డిని జత చేశానని ఆయన చెప్పారు. ఆ తర్వాత 1913లో మాదిరి భాగ్యరెడ్డి హిందూ సమాజానికి చేసిన అపూర్వ సేవలకు గుర్తింపుగా ఆర్య సమాజ్ ''వర్మ'' అనే బిరుదు ప్రదానం చేశారు. ఆనాటి నుండి బాగయ్య భాగ్య రెడ్డిగా మారి, మాదిరి భాగ్యరెడ్డి వర్మగా, ఎం.వి. భాగ్యరెడ్డి వర్మగా ప్రసిద్ధికెక్కాడు.1913లో 'ఆర్య సమాజ్' ఆయన సమాజానికి చేసిన సేవలకు గుర్తింపుగా 'వర్మ' అన్న బిరుదును ప్రధానం చేశారు. దాంతో ఆయన భాగ్యరెడ్డి వర్మగా గుర్తింపు పొందాడు. భాగ్యరెడ్డి 1906లో షెడ్యూల్డు కులాల బాల బాలికల విద్య కోసం హైదరాబాదు లోని ఈసామియా బజారులో జగన్మిత్ర మండలిని స్థాపించాడు. హరిజనులలో విద్యావశ్యకతను గుర్తించి 1910లో జగన్మిత్ర మండలి ఆధ్వర్యంలో మొదటి ప్రాథమిక పాఠశాలను ప్రారంభించాడు. భాగ్యరెడ్డి వర్మ అంటరాని కులాల ఉద్ధరణకై 1911లో మన్య సంఘాన్ని ఏర్పాటు చేసి, జగన్మిత్ర మండలి కార్యకలాపాలు మన్య సంఘం ద్వారా కొన సాగించాడు. మన్య సంఘం అంటరాని కులాల ప్రజల్లో చైతన్యం తీసుకు రావటానికి ప్రయత్నించింది. కొంతమంది ఉన్నత కులాల హిందువులు కూడా ఈ భజన మండళ్లను ప్రోత్సహించారు. మన్య సంఘం ఆధ్వ ర్యంలో ఈ భజన మండళ్లు రీడిరగ్ రూములు ఏర్పరచి అందులో ఆంధ్రప్రత్రిక, దీనబంధు మొదలైన పత్రికలను అందుబాటులో ఉంచాయి. ప్రదానంగా దళిత మహిళను, ఆ తర్వాత వెనకబడిన తరగతులకు చెందిన యువతులను ప్రత్యేకంగా దేవునికి అంకితమిచ్చే కార్యక్రమాలు నైజాం రాజ్యం లోని తెలంగాణ, మరట్వాడా, కన్నడ ప్రాంతాల్లో పురోహితులనబడే జంగాలు నిర్వహించేవారు. ఈ దురాచారాన్ని రూపుమాపడానికి భాగ్యరెడ్డి వర్మ దూరదృష్టితో కార్యాచరణ చేపట్టాడు. ఆయన కృషివల్ల నిజాం దేవదాసి వ్యవస్థను నిర్మూలించాడు. 1917లో బెజవాడలో జరిగిన తొలి పంచమ మహా సభకు భాగ్యరెడ్డి వర్మ అధ్యక్షత వహించాడు. ఈ మహాసభలో ఆయన ప్రసంగానికి ప్రభావితులైన నిర్వాహకులు ''ఆంధ్రదేశ తొలి ఆది ఆంధ్ర మహాసభ''గా పేరు మార్చారు. తర్వాత 1919లో బందరులో, 1921లో ఏలూరు, భీమవరం, 1925లో అనంతపూర్, 1933లో నాగపూర్, 1938లో కాకినాడ తదితర చోట్ల జరిగిన ఆది ఆంధ్ర మహాసభలకు అధ్యక్షత వహించాడు.1917లో విజయవాడలో ఆంధ్ర పంచమ మహాజన సభలో, భాగ్యరెడ్డి వర్మ, ఏ హిందూ పురాణేతిహాసాల్లోనూ పంచము లనే పదం లేదని, ఈ ప్రాంతానికి మొట్ట మొదటి నుండి స్థానికులైన ప్రజలు పంచములే కాబట్టి, ఆది ఆంధ్రులనే వ్యవహారం సరైనదని తీర్మానించాడు. 1917 నుండి 1938 వరకు ఆది ఆంధ్ర మహా సభలు దాదాపు ప్రతి ఏటా జరిగాయి. అంటరాని వారిని ఆది హిందువులుగా పిలవాలని డిమాండు చేశారు. ఈ ఆది ఆంధ్ర మహాజన సభల ప్రభావంతో 1931 జనాభా లెక్కలలో మాల, మాదిగ, ధేర్, చమర్ లాంటి వారికి నిజాం ప్రభుత్వం ఆది హిందువులుగా పేర్కొన్నది.1933 కల్లా ఆది హిందూ సోషల్ సర్వీసు లీగు ఆధ్వర్యంలో 26 పాఠశాలలు ప్రారంభ మయ్యాయి. వీటిలో దాదాపు 2600 మంది విద్యార్థులకు చదువు చెప్పేవారు. భాగ్యరెడ్డి వర్మకు హిందూమతంపై విశ్వాసం లేక మొదట్లో అర్య సమాజం, బ్రహ్మసమాజం బోధనలను పాటించేవాడు. తర్వాత బౌద్ధం పట్ల ఆకర్షితు డయ్యాడు. గౌతమ బుద్ధుడు ప్రవచించిన సమానత్వం, సౌభ్రాతృత్వం, స్వేచ్ఛ మొదలైన అంశాల పట్ల ఆకర్షితుడయ్యాడు. 1913 నుండి ప్రతి వైశాఖ పూర్ణిమ రోజున బుద్ధ జయంతిని జరుపు కొనే వాడు. తన ఏకైక కుమారునికి గౌతమ్ అని పేరు పెట్టుకున్నాడు. 1917 డిసెంబర్ 15వ తేదీన కలకత్తాలో మహాత్మా గాంధీ పాల్గొన్న ''అఖిల భారత హిందూ సంస్కరణ మహాసభ''లో భాగ్యరెడ్డి వర్మ కూడా పాల్గొని, అనర్గళంగా, అర్థవంతంగా, ఆలోచనాత్మకంగా చేసిన ప్రసంగం గాంధీజీని సైతం ఆకర్షించింది. మరునాట కలకత్తాలో మహాత్మా గాంధీ అధ్యక్షతన మరో సమావేశంలో పాల్గొనడానికి భాగ్యరెడ్డిని ఆహ్వానించి, వేదిక మీదకు తీసుకు రావడానికి తన ప్రైవేట్ కార్యదర్శిని పంపి, భాగ్యరెడ్డిని, గాంధీజీ తన ప్రక్కన కూర్చో బెట్టు కోవడాన్ని బట్టి ఆయన పట్ల గాంధీకి ఎంత గౌరవమో స్పష్ట మౌతున్నది. భాగ్యరెడ్డి వర్మ దళితుల నుద్దేశించి...'దళితులే ఈ దేశపు మూల వాసులు. అవిద్య, అజ్ఞానం వల్ల మాత్రమే దళితులు వెనకబడి ఉన్నారు'' అని ఆయన బోధించే వారట. దక్కన్‌లో భాగ్యరెడ్డి వర్మ నిర్మించిన ఆదిజన ఉద్యమం దేశవ్యాపితంగా నడిచిన ఆదిజన మూలవాసీ ఉద్యమానికి అనుసంధాన కర్తగా పనిచేసింది. భాగ్యరెడ్డి వర్మ స్థాపించిన భాగ్య నగర్ అనే పత్రికలో సాహిత్యంలో తొలిసారిగా తాను రాసిన నవల వెట్టి మాదిగ సాహిత్యాన్ని తానే తొలిసారి ప్రచురించాడు. అస్పృశ్యతా నివారణకు భాగ్యరెడ్డి వర్మ చేసిన కృషికి, గుర్తింపుగా హైదరాబాద్‌లోని ఇసామియా బజార్ ప్రధాన రోడ్‌కు 'భాగ్య రెడ్డి వర్మ మార్గ్' అని నగర పాలక సంస్థ దేశ స్వాతంత్ర్యాని కంటే ముందే నామకరణం చేయడం విశేషం. భాగ్య రెడ్డి వర్మ 1939 ఫిబ్రవరి 18న క్షయ వ్యాధితో హైదరాబాదులో మరణించాడు.

# ఉగ్రవాదానికి మంగళం పలకాలి



ప్రపంచంలో ఎప్పుడూ ఏదో ఒక చోట ఏవో అలజడులు చెలరేగుతూనే ఉన్నాయి. మానవ రుధిరం ఏరులై ప్రహహిస్తూనే ఉంది. మతం పేరుతోనో, ప్రాంతం పేరుతోనో మారణ కాండ విశృంఖల విహారం చేస్తూనే ఉంది. ఒక వైపు ఉక్రెయిన్‌రష్యా యుద్ధం ప్రపంచ ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేసింది. ఇజ్రాయెల్, హమాస్ దాడులు గాజాను రక్తం సిక్తం చేసాయి. పాక్ ప్రేరణతో భారత్‌లో సీమాంతర ఉగ్రవాదం ప్రబలింది. ఇటీవల పహల్గాంలో అమాయకులను ఉగ్రవాదులు అత్యంత దారుణంగా కాల్చిచంపడంతో భారత్ పాక్‌ల మధ్య తీవ్రమైన ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. మనుషుల ప్రాణం తీసే మానసిక ఉన్మాదం పతాక స్థాయికి చేరింది. ఇతర దేశాలను నరమేథంతో దారికి తెచ్చుకోవాలనే పరాకాష్ఠకు చేరిన పైశాచిక అకృత్యాన్ని 'ఉగ్రవాదం' గా పేర్కొనవచ్చు.ఉగ్రవాదం ఆధునిక కాలంలో కొనసాగుతున్న అత్యంత క్రూరమైన ఆటవిక చర్య. ఉగ్రవాదం భారత దేశానికి ఒక విషమ సమస్యగా మారింది. స్వాతంత్ర్యానికి ముందు, తర్వాత కూడా భారతదేశం అనేక రూపాల్లో కొనసాగుతున్న ఉగ్రవాదం వలన నష్టపోతూనే ఉంది. దేశవిభజన సమయంలోనే అనేక విధాలుగా నష్టపోయాం.

ఇప్పుడు కూడా ఉగ్రవాదం రూపంలో పరాయి మూకలు దేశాన్ని కబళించాలని చూస్తున్నాయి. ఇతరుల స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలను గుర్తించి గౌరవించిన దేశానికి నేటికీ కష్టాలు తప్పలేదు. బంగ్లా విమోచనకోసం పోరాడినా, లంకేయుల దేశసమగ్రత కోసం శ్రీలంకకు శాంతి సైన్యాన్ని పంపించి కాపాడినా భారత దేశానికి శత్రుబాధలు తప్పలేదు, చేదు ఫలితాలను చవిచూస్తున్నాం.పొరుగు దేశాల్లోని ఉగ్రవాదుల పంజాకు భారతదేశం మూల్యం చెల్లించుకోవడం ఇంకా కొనసాగుతూనే ఉన్నది. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా అదొక అనాగరిక, అమానుష ప్రక్రియగానే భావించాలి. అమాయ ప్రజల రుధిరంతో తడిసిన కర్కశమూకల వికృత ఆగడాలకు అడ్డాగా మారిన ఉగ్రవాద సంస్థలకు ఊతమిచ్చే ఏ దేశమైనా తమ పాపకృత్యాలకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు. రాయబారాలతో, ఒప్పందాలతో రాజీపడని మనస్తత్వాలకు దండోపాయమే శరణ్యమన్న సూత్రం ఇటీవల భారత్ జరిపిన ఆపరేషన్ సందూర్ నిరూపించింది. ఉగ్రవాద శిబిరాల ధ్వంసం ఉరిమురిమి చూసే ఉగ్రదేశమైన పాకిస్తాన్‌కు ముచ్చెమటలు పట్టించింది. భారత శాంతి వచనాలను పొరుగు దేశం అసమర్థతగా భావించడం తెంపరితనం. అవసరార్థ స్నేహాలను చూసుకుని పాక్ రెచ్చిపోతే భారత్ నుంచి ప్రతిఘటన అంతకు వెయ్యి రెట్లుంటుందనే వాస్తవాన్ని దాయాది దేశం గమనించాలి.


నాగరికత వెల్లివిరిసిన నేటి ప్రపంచంలో మనుషుల రక్తం తాగే ఉగ్రవాద మూకలు ఆటవిక మానవులకంటే వికృతంగా, క్రూరంగా ప్రవర్తించడం మానవత్వానికే మాయని మచ్చ. ప్రపంచమంతా ఉగ్రవాదాన్ని అసహ్యించుకుంటున్నా 'నవ్విపోదురు గాని నాకేటి సిగ్గు' అనే రీతిలో పాక్ బరితెగించింది. పాక్ ప్రభుత్వం, మిలిటరీ ఉగ్రవాదులకు అండగా నిలబడడం దౌర్భాగ్యం. ఉగ్రవాదుల పీడ వదిలించుకోలేని పాక్ ఆర్థికంగా పతనావస్థకు చేరింది. పాక్‌లో అంతర్గత సంక్షోభం విభజన దశకు చేరుకుంది. తన ఇంటిని చక్కదిద్దుకోలేని పాక్ భారత్‌ను నాశనం చేయాలను కోవడం దుర్మార్గమైన చర్య. వ్యక్తులను, వ్యవస్థలను నిర్వీర్యం చేసి, ఆర్థిక మూలాలను ధ్వంసం చేయడమే కాకుండా అమాయక ప్రజల ప్రాణాలను అలవోకగా బలితీసుకుంటూ, నిరంతరం అశాంతిని ప్రజ్వలింపచేస్తూ ఆయా దేశాలను ఆక్రమించుకోవడమో, తమ కనుసన్నల్లో మసలుకునేటట్టు చేయడమో కొన్ని దేశాలకు నిత్యకృత్యంలా మారింది. మానవత్వం నశించిన కరడుగట్టిన పైశాచిక వాదులను సమూహాలుగా ఏర్పాటు చేసి, ఇతర దేశాల్లో మారణహోమం సృష్టించడమే ధ్యేయంగా ఏర్పాటయిన విధ్వంసకారక సంస్థలే ఉగ్రవాద సంస్థలు. ఇతర దేశాల భూభాగాలను ఆక్రమించుకోవాలనే దురుద్దేశంతో అశాంతిని సృష్టించే సామ్రాజ్యవాద శక్తులు ఒకవైపు, అకారణ కలహాలతో నిరంతరం ప్రజల ప్రాణాలను బలితీసుకుంటూ, ఏదో సాధించాలన్న తపనతో మానవత్వాన్ని మంటగలిపి, ఆ మంటల్లో చలికాచుకునే పైశాచికత్వం మరోవైపు ప్రపంచంలో ప్రబలిపోతుండడం విచారకరం. మానవత్వపు ఛాయలు విచ్ఛిన్నకారుల మనస్సుల్లో మచ్చుకైనా కానరావు. కరడుగట్టిన రాక్షసత్వమే నైజంగా బతికే ఉగ్రవాదులను విప్లవకారులుగా, సంస్కర్తలుగా కీర్తించే దేశాలను, ఉగ్రమూకలకు వత్తాసు పలుకుతూ, వారు సాగించే ఘోర హింసాకాండకు ఆర్థికంగా, నైతికంగా సహకరించే దేశాల అనైతిక పోకడలను వర్ణింపతరం కాదు. మతమౌఢ్యవాదంతోనో, సామ్రాజ్యవాదంతోనో, స్వేచ్ఛ పేరుతోనో అమాయకుల కుత్తుకలను ఖండిరచే దుశ్చర్యలకు పాల్పడే కర్కశవాదం నుండి పుట్టిన ఉగ్రవాదాన్ని కూకటివ్రేళ్ళతో పెకలించాయి. చాలామంది ఉగ్రవాదులకు తాము సాగిస్తున్న మారణ కాండకు సంబంధించి సహేతుకమైన కారణం కనిపించదు. ఉగ్రవాదం కూడా కొంత మందికి ఉపాధినిచ్చే ముడిసరుకుగా మారడం అత్యంత హేయం, అమానవీయం. అశాంతిని సృష్టించడం వలన సాధించేదేమీ ఉండదన్న నగ్నసత్యం ఇప్పటి వరకూ జరిగిన మొదటి, రెండవ ప్రపంచ యుద్ధ ఫలితాలు నిరూపించాయి. అమాయకుల ప్రాణాలు బలికావడం తప్ప ఉగ్రవాదుల దుశ్చర్యల వలన ఒనగూడే ప్రయోజనం శూన్యమని ప్రపంచంలో అనేక విధ్వంసాలు సృష్టించి తెరమరుగైన ఉగ్రవాద సంస్థల దృష్టాంతాలను గమనించాలి. భారత దేశం శాంతి కాముక దేశం. ఈ శాంతి వచనాల వల్ల ఇప్పటికే దేశం ఎంతో కోల్పోయింది. భవిష్యత్తులో మన దేశం ఇలాంటి శాంతి వచనాలు వల్లించడానికి సంసిద్ధంగా లేదు. వ్యూహానికి ప్రతివ్యూహం.. దెబ్బకుఎదురు దెబ్బ అన్నట్టుగా ముందుకు సాగితేనే శత్రు దేశాలు దారిలోకి వస్తాయి. చాలా కాలం నుండి మన దేశం అగ్రరాజ్యాల ఒత్తిడి వలనో, ఐక్యరాజ్య సమితి హితవచనాలు పాటించడం వలనో పొరుగు దేశాలు మన దేశాన్ని అనేక ఇబ్బందులకు గురిచేసాయి. ఎంతో మంది భారతీయ ముద్దుబిడ్డలు ఈ దేశ సమైక్యత కోసం బలి దానం గావించబడ్డారు. వారి రక్తతర్పణం వృథాగా పోలేదు. చనిపోయిన వీరుల త్యాగ ఫలం వలనే భారత దేశం సమైక్యంగా మనగలుగుతున్నది. భారత ప్రభుత్వం రాజీవ్ గాంధీ ప్రాణత్యాగం చేసిన మే 21 వ తేదీని ప్రతీ ఏటా 'జాతీయ ఉగ్రవాద వ్యతిరేక దినం' గా పాటిస్తూ ఉగ్రవాదంపై అలుపెరుగని పోరు సాగిస్తున్నది.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# పచ్చిమిర్చి పక్కకు పెట్టేస్తున్నారా..

పచ్చిమిర్చి ఆహారానికి రుచిని జోడిరచడమే కాదు ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుంది. పచ్చి మిర్చిలో అనేక రకాల విటమిన్లు, ఖనిజాలు లభిస్తాయి. ఇది గుండెను ఆరోగ్యంగా ఉంచడంతో పాటు అనేక వ్యాధులతో పోరాడటానికి సహాయపడుతుంది. పచ్చి మిరపకాయలు ఆరోగ్యానికి మేలు చేసే అనేక పోషకాలు, యాంటీఆక్సిడెంట్లను కలిగి ఉన్నాయి. పచ్చి మిరపకాయలలో విటమిన్ సి, విటమిన్ ఎ, బీటా కెరోటిన్, ఐరన్ , పొటాషియం వంటి మూలకాలు పుష్కలంగా లభిస్తాయి. దీనితో పాటు ఇందులో "క్యాప్సైసిన్" అనే ప్రత్యేక మూలకం ఉంటుంది. దీని కారణంగానే పచ్చి మిరపకాయ కారంగా ఉంటుంది. ఈ క్యాప్సైసిన్ మన శరీరానికి అనేక విధాలుగా ప్రయోజనకరంగా ఉంటుంది. పచ్చి మిరపకాయల్లో ఉండే క్యాప్సైసిన్ గుండె ఆరోగ్యానికి మంచిదని అనేక పరిశోధనలు సూచిస్తున్నాయి. ఇది శరీరంలో చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడుతుంది. మంచి కొలెస్ట్రాల్‌ను నిర్వహించడంలో సహాయపడుతుంది. అదనంగా ఇది రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. రక్త ధమనులలో కొవ్వు నిల్వలను తగ్గించడంలో సహాయపడుతుంది. దీనివల్ల గుండెపోటు, స్ట్రోక్ ప్రమాదాన్ని తగ్గించవచ్చు. అంతేకాదు పచ్చి మిరపకాయలలో యాంటీ-ఆక్సిడెంట్లు ఉన్నాయి. ఇవి శరీరంలో మంటను తగ్గిస్తాయి. గుండె జబ్బుల ప్రమాదాన్ని నివారిస్తుంది. క్యాన్సర్‌తో పోరాడడంలో సహాయపడుతుంది. పచ్చిమిర్చి గుండె సంబంధిత సమస్యలతో పోరాడటమే కాదు క్యాన్సర్ వంటి వ్యాధులతో పోరాడటంలో కూడా సహాయపడుతుంది. ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌ను తొలగించడానికి పనిచేస్తాయి. ఫ్రీ రాడికల్స్ అనేవి కణాలను దెబ్బతీయడం ద్వారా క్యాన్సర్‌కు కారణమయ్యే హానికరమైన కారకాలు. పచ్చి మిరపకాయలలో లభించే క్యాప్సైసిన్ కొన్ని రకాల క్యాన్సర్ కణాలు పెరగకుండా నిరోధిస్తుంది. ముఖ్యంగా ప్రోస్టేట్, కడుపు, ఊపిరితిత్తుల క్యాన్సర్ల నివారణలో పచ్చి మిర్చి ప్రయోజనాలు అధికం.



# రోజూ వాకింగ్ చేస్తున్నారా..?

నడక ఒత్తిడిని తగ్గిస్తుంది, మానసిక స్థితిని మెరుగుపరుస్తుంది. క్రమం తప్పకుండా రోజూ 4560 నిమిషాలు లేదా అంతకంటే ఎక్కువసేపు నడవడం వల్ల అదనపు ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. వారానికి కనీసం 300 నిమిషాలు అంటే 5 గంటలు చురుకుగా ఉండటం ద్వారా మరిన్ని ప్రయోజనాలను పొందవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. సంపూర్ణ ఆరోగ్యం కోసం సరైన ఆహారంతో పాటు తగినంత శారీరక శ్రమ కూడా తప్పనిసరి అని వైద్యులు తరచూ చెబుతుంటారు. అందుకే ప్రస్తుతం చాలా మంది వాకింగ్‌ను ఎంచుకుంటున్నారు. వ్యాయామం చేయలేకపోయినా, పరిగెత్త లేకపోయినా కొన్ని నిమిషాలు నడవడం వల్ల మేలు జరుగుతుందని వైద్యులు చెబుతున్నారు. వాకింగ్ చేయడం చాలా ఈజీ.. నడకకు ఎక్కువ శ్రమ లేదా సమయం అవసరం లేదు. అయితే, మీరు రోజుకు ఎంత సేపు నడుస్తున్నారో ఎప్పుడైనా గమనించారా..? ఎంత సమయం వాకింగ్ చేయటం ఆరోగ్యానికి మంచిదో ఇక్కడ తెలుసుకుందాం.. రోజూ వాకింగ్ చేయడం వల్ల ఎన్నో లాభాలు ఉంటాయి. దీర్ఘకాలంలో ఎంతో మేలు జరుగుతుంది. బరువు తగ్గేందుకు కూడా వాకింగ్ బెస్ట్ ఆప్షన్. డయాబెటిస్, బీపీ తగ్గించడంలో కూడా వాకింగ్ ప్రభావవంతంగా పనిచేస్తుంది. రోజూ నడక వల్ల గుండె ఆరోగ్యం మెరగవుతుంది. నడక రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. రక్తపోటును అదుపులో ఉంచుతుంది. గుండె పనితీరును మెరుగుపరుస్తుంది. అయితే, రోజువారీ వాకింగ్ వ్యక్తిగత ఆరోగ్యం, ఫిట్‌నెస్ స్థాయి, జీవనశైలి కారకాల ఆధారంగా మారుతుంది. సాధారణ ఆరోగ్య ప్రయోజనాల కోసం, వారంలో.. చాలా రోజులు కనీసం 30 నిమిషాల పాటు బ్రిస్క్ వాక్ లక్ష్యంగా పెట్టుకోవాలని నిపుణులు చెబుతున్నారు. నడకను మన దినచర్యలో భాగం చేసుకోవటం వల్ల మంచి ఆరోగ్యం సొంతం చేసుకోవచ్చు అంటున్నారు నిపుణులు. నడకతో పాటుగా చిన్నపాటి వ్యాయామాలతో శరీరాన్ని సాగదీయడం ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుందని చెబుతున్నారు. వాకింగ్‌తో కేలరీలను బర్న్ చేయడంలో, ఆరోగ్యకరమైన బరువును నిర్వహించడంలో సహాయపడుతుంది. మీ కండరాలను బలోపేతం చేస్తుంది. గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది. నడవడం, లిఫ్ట్‌కు బదులుగా మెట్లు ఎక్కడం లేదా భోజన విరామ సమయంలో నడకకు వెళ్లడం మీ దినచర్యలో భాగం చేసుకోవటం మంచిదని నిపుణులు చెబుతున్నారు. నడక ఒత్తిడిని తగ్గిస్తుంది, మానసిక స్థితిని మెరుగుపరుస్తుంది. క్రమం తప్పకుండా రోజూ 4560 నిమిషాలు లేదా అంతకంటే ఎక్కువసేపు నడవడం వల్ల అదనపు ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. వారానికి కనీసం 300 నిమిషాలు అంటే 5 గంటలు చురుకుగా ఉండటం ద్వారా మరిన్ని ప్రయోజనాలను పొందవచ్చని వైద్యులు సూచిస్తున్నారు.



# మునగ ఆకులతో ఇంత మ్యాజిక్ ఉందా..?

బరువు తగ్గాలనుకునేవారికి మునగాకుపొడి మంచిది. గాయలను త్వరగా మానేలా చేయడంలో మునగాకు ముందు వరుసలో ఉంటుంది. మునగాకులో ఐరన్ అధికంగా ఉంటుంది. రక్తహీనతతో బాధపడేవారు రోజూ ఆహారంలో మునగ ఆకును చేర్చుకోవటం వల్ల మంచి ఫలితం ఉంటుంది. ఈ గింజల నుంచి తీసిన నూనెను కొన్ని రకాల వ్యాధులను అదుపు చేసేందుకు వాడుతారు. మునగకాయ ప్రయోజనాలు దాదాపు అందరికీ తెలిసిందే..కానీ, మునగ ఆకుల వల్ల కలిగే లాభాలు మాత్రం చాలా తక్కువ మందికి మాత్రమే తెలుసు. మునగ ఆకుల ప్రయోజనం తెలిస్తే మాత్రం అందరూ వాటి వినియోగాన్ని మొదలుపెట్టడం ఖాయమని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. మునగ ఆకు ప్రయోజనాలు, ఆరోగ్య లాభాలేంటో తెలిస్తే చిన్న రెమ్మ కూడా వదిలకుండా దాచుకుంటారు..ఎందుకంటే.. మునగ ఆకులో విటమిన్లతోపాటుగా లవణాలు, యాంటీ ఆక్సిడెంట్స్ సమృద్ధిగా ఉంటాయి. పోషకలేమితో బాధపడేవారికి మునగ ఔషధం అంటున్నారు ఆరోగ్య నిపుణులు. మునగాకులో ఉండే 46 రకాల సహజ యాంటీ ఆక్సిడెంట్లు క్యాన్సర్ కణాల పెరుగుదలను, కాలేయ సంబంధ వ్యాధులు, అల్జీమర్స్‌ను అదుపు చేస్తాయి. కీళ్ల నొప్పులు తగ్గించడంలోనూ మునగాకు ఉపయోగపడుతుంది. బరువు తగ్గాలనుకునేవారికి మునగాకుపొడి మంచిది. గాయలను త్వరగా మానేలా చేయడంలో మునగాకు ముందు వరుసలో ఉంటుంది. మునగాకులో ఐరన్ అధికంగా ఉంటుంది. రక్తహీనతతో బాధపడేవారు రోజూ ఆహారంలో మునగ ఆకును చేర్చుకోవటం వల్ల మంచి ఫలితం ఉంటుంది. మునగాకు జీర్ణక్రియకు సాయపడుతుంది. ఇది రక్తపోటును నియంత్రించడలోనూ ఉపయోగపడుతుంది. మునగ కాయ, ఆకు మాత్రమే కాదు.. ఎండిన మునగ గింజల పొడి శరీరంలోని మలినాలను తొలగించేందుకు ఉపయోగపడుతుంది. ఈ గింజల నుంచి తీసిన నూనెను కొన్ని రకాల వ్యాధులను అదుపు చేసేందుకు వాడుతారు.



# పింక్ సాల్ట్ వాడుతున్నారా?

ఈ రకమైన ఉప్పులోని ఖనిజాలు శరీరం నుండి విషాన్ని బయటకు పంపి ప్రేగులను శుభ్రపరచడంలో సహాయపడతాయి. ఇది గట్ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. హిమాలయన్ పింక్ సాల్ట్ అని పిలిచే ఈ ఉప్పులోని మెగ్నీషియం కంటెంట్ కండరాలు, నరాలను సడలించడానికి సహాయపడుతుంది. ఇది నిద్ర నాణ్యతను పెంచుతుంది. సాధారణంగా మనందరం వాడే ఉప్పు వైట్ కలర్‌లో ఉంటుంది. దాదాపు అందరి ఇళ్లల్లోనూ ఈ తెల్ల ఉప్పునే ఎక్కువగా వాడుతుంటారు. కానీ, పింక్ సాల్ట్ గురించి మీకు తెలుసా..? అదే హిమాలయన్ పింక్ సాల్ట్ అని కూడా అంటారు. ఇది సహజంగా గులాబీ రంగులో ఉంటుంది. ఇది సాధారణ సాల్ట్‌తో పోలిస్తే ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. పింక్ సాల్ట్ ఉప్పులో ఖనిజాలు సమృద్ధిగా ఉంటాయని పలు పరిశోధనలు చెబుతున్నాయి. టేబుల్ ఉప్పు కంటే ఎక్కువ కాల్షియం, ఇనుము, పొటాషియం, మెగ్నీషియం ఈ పింక్ సాల్‌ట్‌లో ఉన్నాయని చెబుతున్నారు.. ఈ రాతి ఉప్పు జీర్ణ ఎంజైమ్లను సక్రియం చేయడానికి సహాయపడుతుంది. ఇది గట్ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఇది జీవక్రియను వేగవంతం చేస్తుంది. పింక్ ఉప్పు జీర్ణక్రియ కోసం ద్రవ ఉత్పత్తిని ప్రేరేపిస్తుంది, అవసరమైన పోషకాలను బాగా గ్రహించడానికి, కొవ్వు నిల్వను నివారించడానికి సహాయపడుతుంది. వెచ్చని నీటితో కలిపినప్పుడు, పింక్ ఉప్పు ఎలక్ట్రోలైట్ సమతుల్యతను నిర్వహిస్తుంది, ఇది నిర్జలీకరణం, అలసటను నివారిస్తుంది, ఇది తరచుగా బరువు పెరగడంతో సంబంధం కలిగి ఉంటుంది. పింక్ సాల్‌ట్‌లో పొటాషియం, కాల్షియం,మెగ్నీషియంతో సహా 84 ఖనిజాలు ఉంటాయి. ఈ రకమైన ఉప్పులోని ఖనిజాలు శరీరం నుండి విషాన్ని బయటకు పంపి ప్రేగులను శుభ్రపరచడంలో సహాయపడతాయి. ఇది గట్ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. హిమాలయన్ పింక్ సాల్ట్ అని పిలిచే ఈ ఉప్పులోని మెగ్నీషియం కంటెంట్ కండరాలు, నరాలను సడలించడానికి సహాయపడుతుంది. ఇది నిద్ర నాణ్యతను పెంచుతుంది.



# యవ్వనంగా కనిపించాలనుకుంటున్నారా..?

చాలా మంది కూల్ వాటర్ ఎక్కువగా తాగుతుంటారు.. కానీ, ఇది సరైనది కాదు.. చాలా చల్లని లేదా వేడి నీరు చర్మానికి మంచి కంటే చెడే ఎక్కువ చేస్తుందిని నిపుణులు చెబుతున్నారు. ఇందుకోసం గోరువెచ్చని లేదంటే గది ఉష్ణోగ్రత నీటిని తీసుకోవడం వల్ల పోషకాలను గ్రహించడంలో సహాయపడుతుంది. తిన్న వెంటనే నీళ్లు తాగకూడదని చెబుతున్నారు.. దీనివల్ల జీర్ణక్రియ మందగిస్తుంది. నీళ్లు శరీరానికి ఎంతో అవసరం. ముఖ్యంగా ఎండాకాలంలో మరీ ఎక్కువ నీళ్లు తాగుతాం.. అయితే ఈ నీటిని సరైన విధానంలో తాగితే యవ్వనంగా కూడా ఉంటామని మీకు తెలుసా..?ఆశ్చర్యంగా ఉంది కదూ..కానీ, ఇదే నిజం అంటున్నారు నిపుణులు. నీళ్లు తాగడమే కాదు.. దానిని సరైన పద్ధతి ప్రకారం తీసుకుంటే మీరు 40 ఏళ్ల వయసులోనూ 20 ఏళ్ల చిన్నవారిలా కనబడతారని అంటున్నారు. ఉదయం నిద్ర లేవగానే ఒక పెద్ద గ్లాసులో గోరువెచ్చని నీటిని తాగడం అలవాటు చేసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. ఇది ఆరోగ్యానికి, శరీరానికి చాలా మంచిదని చెబుతున్నారు. రాత్రంతా శరీరం డిటాక్స్ మోడ్‌లో ఉంటుంది. ఒంట్లో పేరుకుపోయిన మలినాలను బయటకు పంపడానికి నీళ్లు చాలా అవసరం. నెమ్మదిగా నీరు తాగడం వల్ల మెరిసే చర్మం మీ సొంతమవుతుందని నిపుణులు సూచిస్తున్నారు. రాగి పాత్రలో నిల్వ ఉంచిన నీటిని రోజుకు ఒక్కసారైనా తాగాలని నిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే, రాగి సహజ యాంటీఆక్సిడెంట్‌గా పనిచేస్తుందని చెబుతున్నారు. ఇది శరీరంలో యాంటీ బాక్టీరియల్ లక్షణాలను పెంచుతుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. శరీరం, కడుపులో మంటను తగ్గిస్తుంది. చర్మానికి సహజమైన మెరుపుని ఇస్తుందని నిపుణులు సూచిస్తున్నారు. నీటిలో పుదీనా, నిమ్మకాయ, దోసకాయ లేదా కొన్ని బెర్రీ ముక్కలను కలిపి 'డిటాక్స్ వాటర్' తయారు చేసుకుని కూడా తీసుకోవచ్చునని నిపుణులు చెబుతున్నారు. ఈ నీటిలో ఉండే విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు మీ ముఖం కాంతిని తిరిగి తీసుకురావడానికి దోహదం చేస్తాయని నిపుణులు చెబుతున్నారు. నీటిని ఒకేసారి ఎక్కువ మొత్తంలో కాకుండా రోజంతా కొద్దికొద్దిగా తీసుకుంటూ ఉండాలని నిపుణులు చెబుతున్నారు. దీనివల్ల రక్త ప్రసరణ బాగుంటుంది. ఇది చర్మ ఆరోగ్యాన్ని కాపాడుతుందని అంటున్నారు. చాలా మంది కూల్ వాటర్ ఎక్కువగా తాగుతుంటారు.. కానీ, ఇది సరైనది కాదు.. చాలా చల్లని లేదా వేడి నీరు చర్మానికి మంచి కంటే చెడే ఎక్కువ చేస్తుంది. గోరువెచ్చని లేదా గది ఉష్ణోగ్రత నీరు పోషకాలను గ్రహించడంలో సహాయపడుతుంది. తిన్న వెంటనే నీళ్లు తాగకూడదని చెబుతున్నారు.. దీనివల్ల జీర్ణక్రియ మందగిస్తుంది. ఇక కడుపు ఉబ్బరం వల్ల చర్మం మెరుపు కూడా తగ్గుతుంది.





# తాజాగా విడుదల అయిన అసుర హననం పాట

పవన్ కల్యాణ్ నటించిన 'హరిహర వీరమల్లు' సినిమా నుంచి 'అసుర హననం' పాటను తాజాగా విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రిగా ఆయన నుంచి విడుదలవుతున్న తొలి సినిమా కాబట్టి ఆయన అభిమానులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. జూన్ 12న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్నట్లు కొద్దిరోజుల క్రితమే మేకర్స్ ప్రకటించారు. క్రిష్, జ్యోతికృష్ణ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ పీరియాడిక్ యాక్షన్ అడ్వెంచర్ సినిమాను భారీ బడ్జెట్‌తో ఏఎమ్ రత్నం నిర్మించారు. సంగీతం ఎమ్ ఎమ్ కీరవాణి అందించారు. ఇందులో నిధి అగర్వాల్ హీరోయిన్‌గా నటించగా బాబీ డియోల్, అనుపమ్ ఖేర్, సత్యరాజ్ తదితరులు కీలక పాత్రలలో మెప్పించనున్నారు. తొలి భాగం 'హరి హర వీరమల్లు: పార్ట్ 1- స్వార్డ్ వర్సెస్ స్పిరిట్' పేరుతో తెరకెక్కిన ఈ చిత్రాన్ని దర్శకులు క్రిష్ కొంతభాగం తెరకెక్కించగా.. ఆ తర్వాత నిర్మాత రత్నం కుమారుడు జ్యోతికృష్ణ దర్శకత్వ బాధ్యతలు తీసుకున్నారు. సుమారు 5 ఏళ్ల పాటు ఈ సినిమా షూటింగ్ పనులు కొనసాగాయి.



# ఆ సినిమాపై రాజమౌళి ప్రశంసల వర్షం

ఏదైనా ఓ సినిమా తీశారంటే అది ప్రేక్షకులతో పాటు, సినిమా దిగ్గజాలను మెప్పిస్తే.. ఆ చిత్ర యూనిట్ కి వచ్చే కిక్కే వేరు. తమ సినిమాకు వచ్చిన కలెక్షన్లతో పాటు.. సీనియర్ల నుంచి వచ్చిన ప్రశంసలను చూసి మురిపోతుంటారు. అలాంటిది దర్శకధీరుడు రాజమౌళి నుంచి ఓ చిన్న సినిమాకి ప్రశంసలు వచ్చాయంటే. వాళ్లు పట్టరాని సంతోషంలో తేలిపోతారు. తాజాగా ఓ చిన్న సినిమాపై రాజమౌళి ప్రశంసల వర్షం కురిపించారు. ఆ సినిమానే 'టూరిస్ట్ ఫ్యామిలీ'. అభిషాన్ జీవింత్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో శశికుమార్, సిమ్రాన్ ప్రధాన పాత్రల్లో నటించారు. తాజాగా ఈ సినిమాపై ఎక్స్ వేదికగా స్పందించారు. 'అద్భుతమైన సినిమా చూశాను. హృదయదాన్ని కదిలించింది. అభిషాన్ గొప్పగా రచించి డైరెక్షన్ చేశారు. ఇటీవల కాలంలో నేను చూసిన బెస్ట్ సినిమా ఇది'' అని రాజమౌళి పోస్ట్ చేశారు.. దానిపై టూరిస్ట్ ఫ్యామిలీ దర్శకుడు అభిషాన్ స్పందించారు. ''ఇప్పటికీ నమ్మలేకపోతున్న ఆయన సినిమాలు ఎందో ఆశ్చర్యంగా చూసేవాడిని.. ఇప్పుడు ఆయన నా సినిమాను ప్రశంసించారు. నా పేరు పలికారు'' అంటూ తన ఆనందాన్ని వ్యక్తం చేశారు.





# డౌట్స్ వద్దు.. సుకుమార్ విత్ చరణ్

పెద్ది తర్వాత రామ్ చరణ్ దర్శకుడు సుకుమార్ తో చేయాల్సిన మూవీ కొంచెం ఆలస్యమవుతుందని, ఈలోగా వేరే డైరెక్టర్ తో ఇంకో ప్రాజెక్టు చేస్తారనే ప్రచారం ఈ మధ్య కొంచెం గట్టిగానే తిరిగింది. స్క్రిప్ట్ వర్క్ కారణంగా చూపిస్తూ పలు కథనాలు కూడా వెలువడ్డాయి. వాటికి సుకుమార్ స్వయంగా చెక్ పెట్టేశారు. స్వగ్రామం మట్టపర్రుకి వెళ్లిన సందర్భంగా అక్కడి మీడియాతో మాట్లాడుతూ తన నెక్స్ట్ సినిమా ఆర్సి 17 అని, ప్రస్తుతం స్క్రిప్ట్ పనులతో పాటు ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయని క్లారిటీ ఇచ్చేశారు. జానర్, ఎప్పుడు షూటింగ్ మొదలవుతుందనే వివరాలు చెప్పలేదు కానీ క్లారిటీ అయితే ఇచ్చారు. వచ్చే ఏడాది మార్చిలో పెద్ది రిలీజవుతుంది. ఇంకా పదినెలల సమయం ఉంది కాబట్టి సుకుమార్ కు తగినంత సమయమేనని చెప్పాలి. జూన్ నుంచి షూటింగ్ మొదలుపెట్టుకోవచ్చు. గ్రామీణ ప్రాంతాలు, చిన్న పట్టణాల్లో థియేటర్ సినిమాలు చూస్తున్నారని, నగరాల్లో యువత యాప్స్, ఓటిటికి అలవాటు పడ్డారని ఆవేదన వ్యక్తం చేసిన సుకుమార్ వాస్తవిక కోణంలో మాట్లాడారు. పుష్పలో బిజీగా ఉండటం వల్ల మూడేళ్లు స్వంత ఊరికి రాలేకపోయాయని చెప్పిన సుకుమార్ పిల్లలు, యూత్, స్థానికులతో చాలా సమయం గడిపి అక్కడి కార్యక్రమాల్లో పాలు పంచుకున్నారు. సో ఇక ఎలాంటి కన్ఫ్యూజన్ అక్కర్లేదు. పెద్ది తర్వాత రామ్ చరణ్ 17 సుకుమార్ తోనే. కాకపోతే ఎంత సమయం పడుతుందనేది మాత్రం ఇప్పట్లో చెప్పలేం. రంగస్థలం, పెద్ది లాగా విలేజ్ బ్యాక్ డ్రాప్ కాకుండా సుకుమార్ ఈసారి జానర్ మారుస్తారని తెలిసింది. చరణ్ కు మరింత ఛాలెంజ్ అనిపించేలా కొత్త తరహా క్యారెక్టరైజేషన్ డిజైన్ చేసినట్టు ఇన్ సైడ్ టాక్. యాక్షన్ టచ్ ఎక్కువగా ఉంటూనే సుకుమార్ మార్కు ఎలివేషన్లు, ట్విస్టులు పుష్కలంగా ఉంటాయట. ఇంత కన్నా డీటెయిల్స్ ఆశించడం అత్యాశ కాబట్టి ఇంకొంత కాలం వేచి చూడాలి. ఫ్యాన్స్ అయితే రంగస్థలంని మించిన బ్లాక్ బస్టర్ ఆశిస్తున్నారు.

# సుమంత్.. ఇవి కదా చేయాల్సింది



అక్కినేని వారి ఘన వారసత్వాన్ని కొనసాగిస్తూ సినిమాల్లోకి అడుగు పెట్టిన నటుడు.. సుమంత్. తొలి చిత్రం 'ప్రేమకథ'తోనే నటుడిగా తనేంటో రుజువు చేసుకున్నాడు. కానీ తర్వాత సరైన సినిమాలు ఎంచుకోకపోవడంతో ఒడుదొడుకులు తప్పలేదు. ఐతే 'సత్యం' లాంటి మంచి సినిమాతో గాడిన పడ్డట్లే కనిపించాడు. కానీ తర్వాత మళ్లీ కథ మామూలే. తప్పటడుగులతో కెరీర్ గాడి తప్పింది. ఓ మంచి సినిమా చేయడం.. తర్వాత వరుసగా పేలవమైన సినిమాలు అందించడం.. ఇదే వరస. గోదావరి, మళ్ళీ రావా లాంటి గొప్ప సినిమాల తర్వాత కూడా ఇదే జరిగింది.'మళ్ళీ రావా' తర్వాత సుమంత్ నుంచి చాలా సినిమాలు వచ్చాయి. కానీ ఒక్కటీ ఆకట్టుకోలేదు. ఇక అందరూ సుమంత్‌ను మరిచిపోతున్న దశలో ఇప్పుడు 'అనగనగా' అంటూ ప్రేక్షకుల ముందుకు వచ్చాడు సుమంత్. ఈటీవీ విన్ ద్వారా నేరుగా డిజిటల్‌గా రిలీజైన ఈ చిత్రం ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంటోంది. చూసిన వాళ్లందరూ కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. పిల్లల చదువులు.. వారి మీద సొసైటీ పెట్టే ఒత్తిడి.. ఫ్రీ లెర్నింగ్.. తండ్రీ కొడుకుల బంధం.. ఇలా పలు అంశాలను చర్చిస్తూ సాగిన ఈ సినిమా ప్రేక్షకులను కదిలించేస్తోంది. సొసైటీకి చాలా అవసరమైన సినిమా అంటూ దీన్ని కొనియాడుతున్నారు. నెమ్మదిగా ఈ సినిమాకు ఆదరణ పెరుగుతోంది. ఈ సినిమాలో సుమంత్ నటన గురించి ఎంత చెప్పినా తక్కువే. మెచ్యూర్డ్ రోల్స్‌ను అతను బాగా పోషించగలడని ఇప్పటికే చాలా సార్లు రుజువైంది. 'అనగనగా' ఇందుకు మరో ఉదాహరణ. సుమంత్‌ను అందరూ మరిచిపోతున్న దశలో తన సత్తా ఏంటో ఈ సినిమా మరోసారి రుజువు చేసింది.

# పరేష్ రావల్‌కు అక్షయ్ కుమార్ రూ.25 కోట్ల లీగల్ నోటీసులు



బాలీవుడ్ హీరో అక్షయ్ కుమార్ నటించిన కల్ట్ కామెడీ క్లాసిక్ 'హేరా ఫేరీ'. ఇటీవల ఈ సినిమా మూడవ భాగం షూటింగ్ ప్రారంభమైంది. అక్షయ్ స్వయంగా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. అయితే, ఈ సినిమా ప్రకటించినప్పటి నుండి నెట్టింట అనేక పుకార్లు, ఊహాగానాలు చక్కర్లు కొడుతున్నాయి. ఈ మూవీలో బాబూరావు పాత్ర పోషించిన పరేష్ రావల్ కు ఎంతో పేరు తెచ్చి పెట్టింది. అయితే, మూడో భాగం నుంచి తాను తప్పుకుంటున్నట్లు ఆయన ప్రకటించారు. దీంతో సోషల్ మీడియాలో పలు రూమర్స్ పుట్టుకొచ్చాయి. తాజా సమాచారం ప్రకారం, ఆకస్మత్తుగా ఈ మూవీ నుంచి తప్పుకున్న పరేష్ రావల్ పై అక్షయ్ కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన్నట్లు వార్తలు వస్తున్నాయి. ఆయన నిర్మాణ సంస్థ.. పరేష్ రావల్ పై రూ.25 కోట్ల లీగల్ నోటీసులు పంపినట్లు సమాచారం. కాగా, ఈ మూవీ డైరెక్టర్ ప్రియదర్శన్ తోపాటు నిర్మాతతో తనకు ఎలాంటి విభేదాలు లేవని పరేష్ రావల్ వెల్లడిరచారు. అయితే, ఇంత పేరు తెచ్చిపెట్టిన సినిమా నుంచి పరేష్ రావల్ ఎందుకు తప్పుకున్నారనే దానిపై మాత్రం స్పష్టత రాలేదు.



# కేతిక శర్మ సుడి తిరిగింది..

దేనికైనా టైం కలిసి రావాలని పెద్దలు ఊరికే అనలేదు. కేతిక శర్మను చూస్తుంటే అదే అనిపిస్తోంది. 2021 ఆకాష్ పూరి రొమాంటిక్ తో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన తనకు డెబ్యూనే డిజాస్టరయ్యింది. తర్వాత నాగ శౌర్య లక్ష్య, వైష్ణవ్ తేజ్ రంగ రంగ వైభవంగా దారుణంగా పోయాయి. పవన్ కళ్యాణ్ బ్రోలో సాయి ధరమ్ తేజ్ కు జోడిగా నటిస్తే దాని వల్ల దక్కిన ఫలితమూ అంతంత మాత్రమే. అంటే నికరంగా నాలుగేళ్ల కాలంలో ఒక్క చెప్పుకోదగ్గ హిట్ పడలేదు. దీంతో రాబిన్ హుడ్ లో అదిదా సర్ప్రైజ్ స్పెషల్ సాంగ్ చేసింది. పుష్ప 2లో శ్రీలీల చేయగా లేనిది నేనేంటి అనుకుందో ఏంటో అదే పెద్ద ప్లస్ అయ్యింది. సినిమా పోయింది కానీ కేతిక శర్మ సాంగ్ మాత్రం హిట్టయ్యింది. కట్ చేస్తే శ్రీవిష్ణు సింగిల్ లో మెయిన్ హీరోయిన్స్ లో ఒకరిగా నటించడం కేతిక శర్మకు మరో సూపర్ సక్సెస్ అందించింది. లుక్స్ తో పాటు నటన కూడా ఆకట్టుకునేలా ఉండటంతో క్రమంగా ఆఫర్స్ పెరుగుతున్నాయట. రవితేజ దర్శకుడు కిషోర్ తిరుమల కాంబోలో తెరకెక్కబోయే మూవీకి ఆమె మెయిన్ లీడ్ గా అనుకుంటున్నారని లేటెస్ట్ అప్డేట్. అనార్కలి టైటిల్ ప్రచారంలో ఉంది. తమిళంలో రాజేష్ సెల్వ సినిమా ఒకటి ఆల్రెడీ సెట్స్ మీద ఉంది. గీతా ఆర్ట్స్ సంస్థ మరో చిత్రం కోసం అడ్వాన్స్ ఇచ్చిందనే టాక్ ఉంది. మైత్రి బ్యానర్ లోనే మరో ప్రాజెక్టులో కేతిక లాకయ్యిందని తెలిసింది. ఇది కన్ఫర్మ్ అయ్యాకే రాబిన్ హుడ్ సాంగ్ చేసిందనే లింక్ ని కొట్టిపారేయలేం. సో సింగిల్ తో బోణీ జరిగిపోయింది కాబట్టి కేతిక శర్మ టైం మొదలైనట్టేననుకోవాలి. ఢిల్లీకి చెందిన ఈ ఒకప్పటి సోషల్ మీడియా మోడల్ ప్రస్తుతం హైదరాబాద్ కి షిఫ్ట్ అయ్యే ఆలోచనలో ఉంది. వరస ఆఫర్లు రావడంతో మెల్లగా కెరీర్ సెటిల్ చేసుకోవాలని చూస్తోంది. ఇంకో ఒకటో రెండో హిట్లు పడ్డాయంటే పెద్ద హీరోల సరసన కూడా పిలుపు రావొచ్చు. అయినా అయిదు సంవత్సరాలు ఓపిగ్గా ఎదురు చూసినందుకు రిజల్ట్ అయితే దక్కింది కానీ దాన్ని నిలబెట్టుకోవడమే తరువాయి.

# విశ్వసుందరి కిరీటం అందుకుని 31 ఏళ్లు పూర్తి

## భారత తొలి విశ్వసుందరి జ్ఞాపకాలను పంచుకుంటూ



పద్దెనిమిదేళ్ళ వయసులో విశ్వసుందరి కిరీటాన్ని కైవసం చేసుకుని భారతదేశ సౌందర్య సౌరభాన్ని ప్రపంచ దేశాలకు సుస్మితా సేన్( Sushmita Sen) పరిచయం చేశారు. సరిగ్గా 31 ఏళ క్రితం మే 21న విశ్వసుందరి కిరీటాన్ని ఆమె అందుకున్నారు. భారత్ తరఫున ఈ ఘనత సాధించిన తొలి మహిళగా రికార్డ్ క్రియేట్ చేశారు. దీంతో ఆమె పేరు విశ్వవ్యాప్తంగా గుర్తుండిపోయింది. అప్పటి తీపి గుర్తులను ఆమె తాజాగా మరోసారి గుర్తుచేసుకుంటూ ఫోటలను సోషల్‌మీడియాలో పంచుకున్నారు.

1975, నవంబర్ 19న ఓ బెంగాలీ కుటుంబంలో జన్మించిన సుస్మితా సేన్ తనకు 18వ ఏట విశ్వసుందరిగా కిరీటం అందుకుని చరిత్రలో నిలిచిపోయేలా చేసింది. 'ఈ రోజు నా జీవితంలో ఎప్పిటికీ మరిచిపోలేనిది. నా ఆశలకు మరింత బలాన్ని అందించిన రోజు ఇదే.. ప్రపంచమంతా పర్యటించడానికి అత్యంత స్ఫూర్తిదాయకమైన వ్యక్తులను కలిసే భాగ్యం పొందడానికి దోహదపడిన రోజు. మిస్ యూనివర్స్ రేసులో నా భారతదేశం తొలిసారి విజయం సాధించి 31 ఏళ్లు పూర్తి చేసుకుంది. నా దేశం తరఫున ప్రాతినిధ్యం వహించే అత్యున్నతమైన గౌరవం నాకు అభించిందని ఎప్పటికీ గర్వంగా ఉంటుంది. దానిని మాటలలో చెప్పలేం.' అని ఆమె పంచుకున్నారు.

1994లో విశ్వ సుందరి కిరీటం గెలిచి భారత జాతి ఖ్యాతి పెంచిన సుస్మిత.. ఎన్‌జివోలతో కలిసి పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొనడమే కాకుండా సొంతంగా తనూ కొన్ని సేవా సంస్థలను నిర్వహిస్తోంది. తెలుగులో నాగార్జున సరసన 'రక్షకుడు' చిత్రంలో నటించింది. ఆ తర్వాత సినిమాలకు కొంత విరామం ఇచ్చి పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అందుకుగాను 2013 సంవత్సరానికి సుస్మితాసేన్ మదర్‌థెరిస్సా ఇంటర్నేషనల్ అవార్డు అందుకున్నారు. సామాజిక న్యాయం కోసం కృషిచేసే వారిని గుర్తించి గౌరవించేందుకు ద హార్మనీ ఫౌండేషన్ అనే సంస్థ ఈ అవార్డు నెలకొల్పింది.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక







# ప్లే ఆఫ్స్‌కు ముంబై..

ప్లే ఆఫ్స్‌కు చేరాలంటే తప్పకుండా గెలవాల్సిన మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ చెలరేగారు. అటు బ్యాటింగ్‌లోనూ, ఇటు బౌలింగ్‌లోనూ ఆధిపత్యం ప్రదర్శించి ఢిల్లీ క్యాపిటల్స్‌పై సాధికారిక విజయం సాధించింది. బ్యాటింగ్‌లో సూర్యకుమార్ యాదవ్ (73), బౌలింగ్‌లో మిచెల్ శాంట్నర్ (3/11), బుమ్రా (3/12) ఆకట్టుకోవడంతో ఢిల్లీపై ముంబై ఏకంగా 59 పరుగుల తేడాతో గెలిచింది. ఈ పరాజయంతో ఢిల్లీ క్యాపిటల్స్ ప్లే ఆఫ్స్ ఆశలు దాదాపు గల్లంతైనట్టే..

టాస్ గెలిచిన ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ డుప్లెసిస్ బౌలింగ్ ఎంచుకున్నాడు. దీంతో బ్యాటింగ్‌కు దిగిన ముంబైకు ఆరంభంలో షాక్ తగిలింది. మూడో ఓవర్లోనే రోహిత్ శర్మ (5) అవుటయ్యాడు. ర్యాన్ రికెల్టన్ (25), విల్ జాక్స్ (21) వేగంగా పరుగులు చేయలేకపోయారు. ఆ తర్వాత వచ్చిన సూర్యకుమార్ యాదవ్ మాత్రం సమయోచితంగా ఆడుతూ అర్ధశతకం సాధించాడు. తిలక్ వర్మ (27) కూడా కీలక పరుగులు చేశాడు. చివర్లో నమన్ ధీర్ (24) వేగంగా పరుగులు చేశాడు. 19 ఓవర్లో ఏకంగా 24 పరుగులు రాబట్టాడు. దీంతో ముంబై నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 180 పరుగులు చేసింది. ఢిల్లీ బౌలర్లలో ముఖేష్ కుమార్ రెండు వికెట్లు తీశాడు. ఛమీరా, ముస్తాఫిజుర్ రెహ్మాన్, కుల్దీప్ యాదవ్ ఒక్కో వికెట్ తీశారు.

ముంబై నిర్దేశించిన 181 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన ఢిల్లీకి ఆరంభంలోనే గట్టి షాక్ తగిలింది. ఓపెనర్లు డుప్లిసిస్ (6), కేఎల్ రాహుల్ (11), అభిషేక్ పోరెల్ (6) త్వరగానే అవుటయ్యారు. 27 పరుగులకే 3 వికెట్లు కోల్పోయిన ఢిల్లీని సమీర్ రజ్వీ (39) ఆదుకునే ప్రయత్నం చేశాడు. అయితే ముంబై బౌలర్లు క్రమం తప్పకుండా వికెట్లు తీయడంతో ఢిల్లీ ఏ దశలోనూ విజయం దిశగా సాగలేదు. చివరకు ఢిల్లీ 18.2 ఓవర్లలో 121 పరుగులకే ఆలౌటైంది. ముంబై బౌలర్లలో మిచెల్ శాంట్నర్, బుమ్రా మూడేసి వికెట్లు సాధించారు.










# అహ్మదాబాద్‌లో ఫైనల్ సమరం

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్) సీజన్ 2025 ముగింపు దశకు చేరుకున్న సంగతి తెలిసిందే. జూన్ 3న జరిగే ఫైనల్‌తో మెగా టోర్నమెంట్‌కు తెరపడనుంది. నిజానికి ఐపిఎల్ సమరం మే 25న ముగియాల్సి ఉంది. కానీ భారత్, పాకిస్థాన్ దేశాల మధ్య తలెత్తిన ఉద్రిక్త వాతావరణం నేపథ్యంలో ఐపిఎల్‌ను కొన్ని రోజుల పాటు తాత్కాలికంగా వాయిదా వేయక తప్పలేదు. ఐపిఎల్ రెండో దశ పోటీలకు మే 17న తెరలేచింది. ఇప్పటికే లీగ్ దశ వేదికలను ప్రకటించారు. మ్యాచ్‌లు కూడా జరుగుతున్నాయి. తాజాగా ప్లేఆఫ్‌కు ఆతిథ్యం ఇచ్చే వేదికలను కూడా బిసిసిఐ మంగళవారం ప్రకటించింది. ముందు నిర్ణయించిన ప్రకారం ఫైనల్‌తో పాటు క్వాలిఫయర్ 2 మ్యాచ్‌లకు కోల్‌కతా నగరం ఆతిథ్యం ఇవ్వాల్సి ఉంది. హైదరాబాద్‌లో క్వాలిఫయర్ 1తో పాటు ఎలిమినేటర్ మ్యాచ్ నిర్వహించాల్సి ఉండేది. కానీ ఐపిఎల్ వాయిదా పడడంతో వేదికలను కూడా మార్చారు. జూన్ 3న జరిగే ఫైనల్‌కు అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియం ఆతిథ్యం ఇస్తోంది. క్వాలిఫయర్ 2కు ఇక్కడే జరుగనుంది. ఇక క్వాలిఫయర్ 1తో (%Iూా 2025 టఱఅఞ్రీ%) పాటు ఎలిమినేటర్ మ్యాచ్‌కు చండీగఢ్ సమీపంలో కొత్తగా నిర్మించిన ముల్లాన్‌పుర్ ఆతిథ్యం ఇవ్వనుంది. ప్లేఆఫ్ మ్యాచ్‌లను ఈ రెండు స్టేడియాల్లో నిర్వహించాలని బిసిసిఐ నిర్ణయించింది. అంతేగాక వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని బెంగళూరులో జరగాల్సిన రెండు మ్యాచ్‌లను లక్నోకు మార్చారు. నైరుతి రుతుపవనాల ప్రభావంతో దక్షిణ భారత దేశంలో వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయి. దీంతో ముందు జాగ్రత్తగా బెంగళూరులో జరగాల్సిన మ్యాచ్‌లను ఉత్తర భారత దేశానికి మార్చారు. ఇదిలావుంటే హైదరాబాద్ ఆతిథ్య ఇవ్వాల్సిన ప్లే ఆఫ్ మ్యాచ్‌లు ఇతర చోటికి తరలి వెళ్లడంతో అభిమానుల్లో నిరాశ నెలకొంది. లీగ్ దశ మ్యాచ్‌ను కూడా హైదరాబాద్‌కు బదులు జైపూర్‌కు తరలించారు. తాజాగా ప్లేఆఫ్ వేదికలను కూడా ఉప్పల్ నుంచి వేరే చోటికి మార్చడంతో అభిమానులు నిరాశలో కూరుకు పోయారు.





# అంచనాలు పెరిగినప్పుడు ఒత్తిడికి గురికావొద్దు

మీ మీద అంచనాలు పెరిగినప్పుడు ఒత్తిడికి గురికావొద్దు అని యువ క్రికెటర్లకు ఎంఎస్ ధోని సూచనలిచ్చారు. ఐపిఎల్ 2025 సీజన్‌లో భాగంగా మంగళవారం చెన్నై సూపర్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్ జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో రాజస్థాన్ 6 వికెట్ల తేడాతో గెలిచింది. మొదట బ్యాటింగ్ చేసిన చెన్నై 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 187 పరుగులు చేసింది. రాజస్థాన్ 17.1 ఓవర్లలోనే 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. మ్యాచ్ అనంతరం ధోని యువ క్రికెటర్లకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. " మీ మీద అంచనాలు పెరిగినప్పుడు ఒత్తిడికి గురికావొద్దు. సీనియర్ ఆటగాళ్లు, కోచింగ్ సిబ్బంది నుంచి నేర్చుకోండి. యువ ఆటగాళ్లు 200 ప్లస్ స్ట్రైక్‌రేట్‌తో పరుగులు చేయాలనుకున్నప్పుడు, బ్యాటింగ్‌లో నిలకడ కొనసాగించడం కష్టమే. అయినా మ్యాచ్‌లో ఏ దశలో అయినా సిక్స్‌లు కొట్టగల సామర్థ్యం వారి సొంతం " అని మ్యాచ్ అనంతరం ధోని అన్నారు. అలాగే మ్యాచ్‌లో తమ టీం ప్రదర్శన గురించి కూడా ధోనీ మాట్లాడుతూ %ా% " మేం ప్రత్యర్థి జట్టు ముందు మంచి లక్ష్యమే ఉంచాం. కానీ మ్యాచ్ ఆరంభంలో త్వరత్వరగా వికెట్లు కోల్పోవడంతో లోయర్, మిడిల్ ఆర్డర్‌పై ఒత్తిడి పడిరది. బ్రెవిస్ చక్కటి ఇన్నింగ్స్ ఆడాడు. అతడు బ్యాటింగ్ చేస్తున్నప్పుడు రన్‌రేట్ చక్కగా ఉంది. కానీ మేం మొదట్లోనే వికెట్లు కోల్పోవడంతో దాన్ని కొనసాగించలేకపోయాం. పేసర్ కాంబోజ్ చక్కగా బౌలింగ్ చేశాడు. మనం ఊహించిన దానికంటే అతడి బంతులు మనల్ని వేగంగా తాకుతాయి. పవర్‌ప్లేలో మూడు ఓవర్లు బౌలింగ్ చేయడమంటే అంత తేలిక కాదు. కానీ కాంబోజ్ బాగా బౌలింగ్ చేశాడు " అని ఎంఎస్ ధోనీ వివరించారు.

# రాణించిన శ్రీకాంత్



పురుషుల సింగిల్స్ మాజీ వరల్డ్ నం.1, భారత వెటరన్ షట్లర్ కిదాంబి శ్రీకాంత్ మలేషియా మాస్టర్స్ ఓపెన్ సూపర్ 500 టోర్నమెంట్‌లో ఆకట్టుకున్నాడు. మంగళవారం జరిగిన అర్హత రౌండ్‌లో వరుస విజయాలు సాధించిన కిదాంబి శ్రీకాంత్ ప్రధాన టోర్నమెంట్‌కు చేరుకున్నాడు. చైనీస్ తైపీ షట్లర్ హుయాంగ్ యుపై 921, 2112, 216తో మూడు గేముల మ్యాచ్‌లో శ్రీకాంత్ విజయం సాధించాడు. తొలి గేమ్‌లో నిరాశపరిచినా.. వరుస గేముల్లో సత్తా చాటాడు. అంతకుముందు, చైనీస్ తైపీకే చెందిన మరో షట్లర్ కుయాన్ లిన్‌పై 218, 2113తో శ్రీకాంత్ అలవోక విజయం సాధించాడు. పురుషుల సింగిల్స్ ప్రధాన డ్రా తొలి రౌండ్లో నేడు ఆరో సీడ్ చైనా ఆటగాడు జుయాంగ్ జుతో శ్రీకాంత్ తలపడనున్నాడు. భారత అగ్రశ్రేణి షట్లర్లు పి.వి సింధు, హెచ్.ఎస్ ప్రణరు సైతం నేడు తొలి రౌండ్లో బరిలోకి దిగుతున్నారు. క్వాలిఫయింగ్ రౌండ్‌లో శ్రీకాంత్ మినహా ఇతర షట్లర్లు తేలిపోయారు. పురుషుల సింగిల్స్‌లో తరుణ్ మానెపల్లి 1321, 2123తో, శంకర్ ముతుస్వామి 2022, 2022తో ఓటమి చెందారు. మహిళల సింగిల్స్‌లో అన్మోల్ 1421, 1821తో తేలిపోయింది. మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో మోహిత్, లక్షిత జోడీ 1521, 1621తో వరుస గేముల్లో చేతులెత్తేసింది.

# బెయిర్‌స్టోకు రూ.5.25 కోట్లు



ఇంగ్లాండ్ క్రికెటర్, వేలంలో అమ్ముడుపోని ఆటగాడు జానీ బెయిర్‌స్టో గరిష్టంగా నాలుగు మ్యాచులకు రూ.5.25 కోట్లు అందుకోనున్నాడు. ఐపీఎల్ 18 ప్లే ఆఫ్స్‌కు ఇంకా బెర్త్ ఖాయం చేసుకోని ముంబయి ఇండియన్స్.. ముగ్గురు విదేశీ క్రికెటర్లను కొనుగోలు చేసింది. జానీ బెయిర్‌స్టో సహా రిచర్డ్ గ్లీసన్ (ఇంగ్లాండ్), చరిత్ అసలంక (శ్రీలంక) ముంబయి ఇండియన్స్ తరఫున ఆడనున్నారు. గ్లీసన్‌కు రూ.1 కోటి ఇవ్వనుండగా. అసలంక రూ.75 లక్షలు అందుకోనున్నాడు. ఈ మేరకు ఐపీఎల్ నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. ముంబయి ఇండియన్స్ తీసుకున్న ప్రత్యామ్నాయ ఆటగాళ్ల ఒప్పదం ప్లే ఆఫ్స్ నుంచి అమల్లోకి రానుంది. ముంబయి ఇండియన్స్ జట్టులోని విల్ జాక్స్, రియాన్ రికెల్టన్, కార్బిన్ బాచ్‌లు గ్రూప్ దశ మ్యాచుల తర్వాత అందుబాటులో ఉండటం లేదు. విల్ జాక్స్ వెస్టిండీస్‌తో వైట్ బాల్ సిరీస్ కోసం వెళ్లనుండగా.. రికెల్టన్, బాచ్‌లు ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ కోసం ఇంగ్లాండ్‌కు వెళ్లాల్సి ఉంది. ప్లే ఆఫ్స్‌లో చోటు కోసం ఢల్లీక్యాపిటల్స్‌తో పోటీపడుతున్న ముంబయి ఇండియన్స్.. ముందుగానే ముగ్గురు విదేశీ క్రికెటర్లను జట్టులోకి తీసుకుని డ్రెస్సింగ్‌రూమ్ వాతావరణానికి అలవాటు పడేలా చేయనుంది!.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in